ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 32.0

కనిష్ఠం : 17.0



కార్యకర్తలతో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

5న చింతలపూడిలో 'రా.. కదలిరా' సభ

చింతలపూడి, జనవరి 31 : ఫిబ్రవరి 5వ తేదీన చింతలపూడిలో జరిగే రా.. కదలిరా బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కోరారు. స్థానిక నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్న పార్టీ రానున్న ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఏలూరు పార్లమెంటులోని ఏడు నియోజక వర్గాల నుంచి ఈ సభకు భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో ఆయన వెంట టీడీపీ నాయకులు, మాజీ మంత్రి మాగంటి బాబు, మాజీ ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, ఘంటా మురళీరామకృష్ణ, జోన్-2 నాయకులు మందలపు రవి, నియోజకవర్గ పరిశీలకులు కోళ్ళ నాగేశ్వరరావు, ఆకుమర్తి రామారావు, బొరగం శ్రీనివాస్, జగ్గవరపు ముత్తారెడ్డి, బొమ్మాజీ అనిల్, రోషన్‌కుమార్, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, కామవరపుకోట మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దీక్షా శిబిరం వద్దే నిద్రిస్తున్న మాతృభాషా వలంటీర్లు

సడలని దీక్ష..

బుట్టాయగూడెం, జనవరి 31 : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న మాతృభాషా వలంటీర్లు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు దీక్షా శిబిరంలోనే పడుకుని నిరసన తెలిపారు. వేతన బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మాతృభాషా వలంటీర్లు పలు దఫాలుగా దీక్షలు, నిరసనలు తెలిపారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో ఆగ్రహించిన వలంటీర్లు రాత్రంతా కటిక చలిలో శిబిరంలోనే పడుకుని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు శిబిరం వద్దకు చేరుకుని శిబిరాన్ని ఖాళీచేసి వెళ్లిపోవాలని హెచ్చరించినా తెల్లారేవరకు నిరసన కొనసాగించారు. బుధవారం బీజేపీ నాయకులు వలంటీర్లకు మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు. సమస్యలు పరిష్కారించాలని కోరారు.







ఎన్నికల ముంగిట మోదీ సర్కార్ వరాలు కురిపిస్తుందా ? కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టబోయే మధ్యంతర బడ్జెట్‌లో షాకులుంటాయా ? అందరూ ఊహించినట్టు ఎన్నికల షో..కులంటాయా.. ? అనే ప్రశ్నలు అందరి మదిలోనూ కదలాడుతున్నాయి..? ఏం చేస్తారో చూడాలి.


షాకులా.. ఎన్నికల షోకులా?

- నేడు పార్లమెంటులో కేంద్ర మధ్యంతర బడ్జెట్
- పోలవరం సహా ఇతర ప్రాజెక్టులకు ప్రాధాన్యత దక్కేనా ?
- వేతన జీవుల కలలు నెరబోతున్నాయా ?
- రైతులకు మద్దతుగా నిలిచేనా ? నట్టేట ముంచేనా ?
- ఎన్నికల ముందు ఎడాపెడా వరాలు కురుస్తాయా ?
- అందరిచూపు నిర్మలమ్మ బడ్జెట్‌పైనే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడ్డాయి. మరికొద్ది రోజుల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడబోతుంది. రాజకీయ పక్షాలన్నీ అభ్యర్థుల వేటలో, సర్వేల జాతరలో మునిగి తేలుతున్నాయి. జనం కూడా రాబోయే ఎన్నికల సరళిపై ఉత్కంఠతో ఉన్నారు. గడిచిన ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విసిరిన వరాలు, అనుసరించిన వ్యతిరేకత మధ్య బేరీజు వేసుకునే పనిలో పడ్డారు. ఈ తరుణంలోనే గురువారం పార్లమెంటులో కేంద్ర మధ్యంతర వార్షిక బడ్జెట్‌ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టబోతున్నారు. వాస్తవానికి ప్రతీసారి పూర్తి బడ్జెట్ ప్రవేశపెడుతుండగా, ఈసారి మధ్యంతర బడ్జెట్‌ను ప్రజల ముందుంచబోతున్నారు. గత వార్షిక బడ్జెట్‌లకు, ఈసారి ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌కు మధ్య భారీ వ్యత్యాసం ఉండబోతుంది. వీలైనంత మేర ప్రజాకర్షక బాణాలు వదలబోతున్నారని కొందరు, అవేవీ లేకుండానే ఉత్తుత్తి అంకెలతో సరిపెట్టబోతున్నారని ఇంకొందరు అంచనాలు వేస్తున్నారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు గడిచిన ఐదేళ్లుగా పూర్తిగా మూలనపడింది. ఈ ప్రాజెక్టు నిర్వహణ, పర్యవేక్షణ, నిధుల కేటాయింపు బాధ్యతను భుజానకెత్తుకున్న కేంద్రం ఆ మేరకు కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఏనాడు సానుకూలత ప్రదర్శించలేదు. ఈసారి ప్రాజెక్టును కనికరిస్తారా లేదా అనేది చూడాలి. ఎన్నికల సమయం కాబట్టి అందరినీ ప్రసన్నం చేసుకోవడానికి వీలుగానే కేంద్రం వరం ఇవ్వబోతుందా, లేకుంటే సైలెంట్‌గా మిగిలిపోతుందా..? అనేది రైతులందరిలో కనిపిస్తున్న ఉత్సుకత. జల్‌మిషన్ కింద తాగు నీటి సరఫరా, ఇంటింటికీ కుళాయి పేరిట పథకాలకు మోక్షం కల్పిస్తారా లేక గొంతెండేలా నినదించాలా అనే అనుమానం లేకపోలేదు. ప్రత్యేకించి కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ఏ అంకెల గారెడీ చేయబోతున్నారనేదే ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న.

వేతన జీవుల మాటేంటి



దీర్ఘకాలికంగా భారతీయ జనతా పార్టీ కేంద్రంలో పగ్గాలు చేపట్టిన దగ్గర నుంచి వార్షిక ఆదాయం రూ.రెండున్నర లక్షల వరకు పెంచుతారని ఊహిస్తూ వచ్చారు. కాని ఏయేటి కాయేడు నిర్మలమ్మ ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఆదాయపు పన్ను పరిమితి విషయంలో లక్షలాది మంది ఎదురుచూసే అంశం లోనూ కేంద్రం దోబూచు లాడుతూ వచ్చింది. ఈసారైనా పన్ను మినహాయింపులో వరాలు ఏమైనా ప్రకటిస్తారా, లేదా అనేది తేలిపోనుంది. సాధారణంగా మధ్యంతర బడ్జెట్‌లో కీలక నిర్ణయాలకు వీలుగా పరిస్థితులు ఉండవని, అయితే ఎన్నికలు దగ్గరపడుతున్నాయి కాబట్టి వేతన జీవులను ఆకర్షించేం దుకు ఆదాయ పరిమితిలో కొత్త నిర్ణయాలు ప్రకటిస్తారనే ఆశతో ఉన్నారు. రైతుల విషయంలోనూ ఏమైనా ఆకర్షణీయ పథకాలకు శ్రీకారం చుడతారని భావిస్తున్నారు. ఇప్పటికే ఎరువులు, పురుగు మందు ధరల్లో కొంత తగ్గుదల కనిపించినా వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా పంటల బీమా, ఇతరత్ర అనుకూల పథ కాలు పూర్తిగా వర్తించడమేలేదు. రైతులను సంతృప్తిపర్చడం లేదు. దీంతో రైతాంగంలో కాస్తంత అసంతృప్తి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. దీనికి విరుగుడుగా రైతులకు కలిసొచ్చేటట్టుగా ఎన్నికల ఎత్తులు నిర్మలమ్మ బడ్జెట్‌లో కనిపిస్తాయన్న ఆశతో మరికొందరు ఉన్నారు.

ఆక్వా రంగం ఈవైపే..



చాన్నాళ్లుగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ఆక్వా రంగంలో విదేశీ వాణిజ్యం వైపు ఏమైనా కొత్త చమక్‌లు ఉండబోతున్నాయా ? అనే ఆశతో వేలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారు. ఆక్వా ఎగుమతులపై చాన్నాళ్లుగా ఒడిదుడుకులతో ఆక్వా రైతులు నష్టం చవిచూస్తున్నారు. ప్రత్యేకించి విదేశీ మార్కెట్‌లో మన రొయ్యల ఉత్పత్తులు మార్కెట్ సజావుగా సాగేలా కేంద్రం నిర్ణయాత్మక చర్యలేవీ తీసుకోలేదు. బడ్జెట్‌లోను ఆ మేరకు సంకేతాలు ఇవ్వలేదు. ఈసారైనా ఆక్వా రంగానికి కాస్తంత ఆక్సిజన్ ఇచ్చేలా నిర్ణయాలు ఉంటాయా, లేవా అనేది ఇప్పటికైతే సస్పెన్సే.

బడ్జెట్‌లో షాకులుంటాయా..

ఎన్నికల ముంగిట్లో కొన్నింటిపై మినహాయింపులు, మరికొన్నింటిపై ఒడ్డింపులు ఉండే అవకాశాలున్నాయని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. విద్యా రంగంలో గతంలో ఉత్తమ సంస్కరణలు అమలుచేసే వీలుగా అనేక కీలక అంశాలతోపాటు నిధులు కేటాయించే వారు. రానురాను ఈ తరహా వాటాలు తగ్గిస్తూ వచ్చారు. వైద్య, ఆరోగ్య రంగాల్లోను వరాలిచ్చే ప్రక్రియ సాగిస్తారా, పెట్రోలుతోపాటు ఇతరత్ర వస్తువులపైన ఒడ్డింపులు వేసి షాకులిస్తారా అనేది నేడు తేలబోతుంది.



ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- అధికారులతో డీఆర్వో సమీక్ష

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 31 : ఇంటర్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ బస్సుల వేళలను రీషెడ్యూల్ చేసి నడపాలని డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఏలూరులో బుధవారం ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇంటర్‌బోర్డు, విద్యుత్, ఆర్టీసీ, పోలీసు, వైద్య, మున్సిపల్ శాఖల అధికారులతో ఆయన సమీక్షిం చారు. ఆయన మాట్లాడుతూ.. 'ఫిబ్రవరి 2న నైతికత, మానవీయ విలువలు, 3న పర్యావరణ విద్య పరీక్షలతో ఇంటర్ పరీక్షల తొలిదశ ప్రారంభమవుతుంది. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 15,656 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 16,789 మంది దరఖాస్తు చేసుకోగా మొత్తం 124 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతా యి. రెండోదశలో ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి ఒకేషనల్ విద్యార్థులకు, 11 నుంచి జనరల్ విద్యార్థులకు జరుగుతాయి. మూడోదశలో థియరీ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయి. పరీక్ష ప్రారంభ సమయానికి ఒక గంట ముందుగానే నిర్ణీత కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలి. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు, వాటిని సెంట్రల్ కమాండ్ సెంటర్‌కు అనుసంధానం చేసి పని చేస్తున్నదీ, లేనిదీ ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి. విద్యార్థులు తమ వెంట హాల్‌టిక్కెట్‌తో పాటు విధిగా ప్రభుత్వం జారీచేసిన ఏదేని ఒక గుర్తింపు కార్డు తీసుకెళ్లాలి. ఇన్విజిలేటర్ల కొరత లేకుండా ముందుగానే ఎంతవేలను సమన్వయంచేసుకుని లోటును భర్తీ చేసుకోవాలి'.. అన్నారు. సమావేశంలో డీవీఈవో ప్రభాకరరావు, ఏఎస్పీ శేఖర్, డీఎస్పీ చంద్రశేఖర్, డీపీవో విశ్వనాథ్, డీఈవో శ్యాంసుందర్, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు యోహాను, నాగేశ్వరరావు, పేర్రాజు, మునిసి పల్ ఏఈ భాస్కర్, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, విద్యుత్ డీఈ శ్రీనివాసరావు, ఆర్టీసీ, తపాలా, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్స్ సామగ్రితో జంగారెడ్డిగూడెం పట్టణంలోకి ఒక లారీ ప్రవేశించింది. దిగుమతి ప్రారంభించగానే.. ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి రూ.450 ఆశీలు పన్ను చెల్లించాలన్నాడు. కంగుతిన్న లారీ డ్రైవర్ 'నేను ఎన్నో రాష్ట్రాలు తిరుగుతూ సరుకులు దిగుమతి చేస్తుంటాను' కాని, ఎక్కడా ఇంత పన్ను వసూలు చేయలేద'న్నాడు. పన్ను కడితేనే బండి కదిలేదని ఆ వ్యక్తి అనడంతో డ్రైవర్ ఓనర్‌కు, ఆ ఓనర్ స్థానిక కౌన్సిలర్‌కు విషయం చేరవేశాడు. స్థానిక కౌన్సిలర్ జోక్యంతో రూ.200 పన్ను కట్టి లారీ డ్రైవర్ బయటపడ్డాడు.

ఓ మహిళ జంగారెడ్డిగూడెం మెయిన్‌రోడ్డు పక్కనే కింద బరకం వేసుకుని రోజూ ఉదయం ఆకు కూరలు విక్రయిస్తుంది. ఆమె నుంచి ఆశీలు పన్ను రోజూ రూ.50 వసూలు చేస్తున్నారు.

అడ్డగోలుగా.. ఆశీలు దందా!





- ఘొల్లుమంటున్న చిరువ్యాపారులు
- వలస వ్యాపారులపై రుబాబు
- రశీదులు ఇవ్వకుండానే పన్ను వసూలు...?
- అంతా తెలిసి మౌనం వహిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం, జనవరి 31 : జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో ఆశీలు పన్నుల పేరుతో దోపిడీకి గురవుతున్నామని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి తోపుడుబండ్లు, బుట్టలు, సైకిల్, ద్విచక్ర వాహనాలపై, పలు రకాల వ్యాపారాలు చేస్తూ జీవనం సాగించే చిరు వ్యాపారులు పట్టణంపై ఆధారపడి జీవిస్తున్నారు. పొట్టకూటి కోసం కష్టపడుతున్న చిరు వ్యాపారులపై ఆశీలు పన్ను దందా రోజురోజుకు పెరిగిపోతోందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ అనుచరులు రోడ్డు పక్కన ఆకుకూరలు, కూరగాయలు, ఇతర నిత్యావసరాలను తాత్కాలికంగా అమ్ముకునే వారి నుంచి రోజుకు రూ.50 నుంచి రూ.100 వరకు అడ్డగోలుగా వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. ఒక్కొక్కసారి రోజు వారి కూలీ డబ్బులు రాకపోయినా అడిగినంత ఆశీలు పన్ను కట్టాల్సిందే. ఇలా వసూళ్లు చేస్తున్న డబ్బులకు రశీదు అడిగితే రెండింతలు పన్ను కట్టాలని రుబాబు చేస్తున్నారనీ వాపోతున్నారు. సీజనల్ వ్యాపారాల కోసం వలస వచ్చిన వ్యాపారులను దోపిడీ చేస్తున్నారని ఇతర రాష్ట్రాల వలసదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు రూ.150 నుండి రూ.200 వరకు ఆశీల పన్ను కట్టాలని కాంట్రాక్టరు అనుచరులు దౌర్జన్యం చేస్తూ భయపెడుతున్నారని వాపోతున్నారు. ఇటీవల పట్టణ ప్రధాన సెంటర్లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వసూలు చేయాల్సిన ఆశీలు పన్నుల వివరాల బోర్డులను ఏర్పాటు చేసినప్పటికీ.. మరుసటి రోజు నుంచే అవి మాయమయ్యాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఆ బోర్డులో రూ.10 కట్టాల్సిన దానికి రూ.50 వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. పట్టణంలో ఒక దుకాణం నుండి మరొక దుకాణానికి ఆటోపై సరుకు తీసుకెళ్లిన వారి నుండి రూ.150 చెల్లించాలని అడగడంతో ఇటీవల ఓ దుకాణం వద్ద జరిగిన వివాదం కాంట్రాక్టర్ అనుచరులు చేస్తున్న దౌర్జన్యానికి అద్దం పడుతోందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వారి చెప్పింది కట్టాల్సిందే. లేక రోడ్డుపైనే పెద్ద రణరంగం తప్పదు. ఇదంతా వ్యాపారం సమయంలో ఎదుకని కట్టేస్తున్నారు. ఇటువంటి ఆరోపణలు ఏమైనా ఉన్నాయా అని అధికారులను అడుగుతుంటే మాకు లిఖిత పూర్వకంగా ఏమీ రాలేదని జవాబు చెబుతున్నారు. అసలు కాంట్రాక్టర్ ఎంతకు పాట పాడుకున్నాడు. మునిసిపాలిటికీ ఎంతకు చెల్లిస్తున్నాడనే వివరాలను అడుగుతుంటే అధికారులు మాత్రం బయటపెట్టకుండా రహస్యంగా ఉంచుతున్నారు.

టౌన్‌లోకి రావాలంటే హడల్

ఇక పట్టణంలోకి అడుగు పెట్టాలంటేనే హడలెత్తిపోతున్నారు. తోపుడు బళ్ల నుంచి రోడ్డు సైడ్ వ్యాపారాలు, సరుకులు దిగుమతి చేసే వాహనాలపై ఆశీలు పేరుతో అధిక సొమ్ములు గుంజుకుంటున్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న జంగారెడ్డిగూడెం పట్టణం దాదాపు 100 గ్రామాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడ విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, రవాణా, వ్యాపారం తదితర వాటికి అనువుగా ఉంది. దీనికితోడు పక్కనే ఏజెన్సీ ఉండటంతో అక్కడున్న ఉద్యోగులు సైతం పట్టణంలోనే స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో పదేళ్లగా పట్టణం విస్తరించింది. పొలాలు ఇళ్లగా మారుతున్నాయి. క్రమేపీ పట్టణ జనాభా విపరీతంగా పెరిగింది. దీనికి తగ్గట్టుగానే ఇక్కడ వ్యాపార సంస్థలు, వీధి తోపుడు బళ్ల, పెద్ద దుకాణాలు, షోరూంలు వెలిసాయి. ఈ క్రమంలో ప్రధాన రహదారులకు ఇరు వైపులా దుకాణాలు వచ్చాయి. నిత్యం పట్టణంతోపాటు ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో ఇక్కడ మార్కెట్ రద్దీగా ఉంటుంది.



పన్ను తగ్గించాలి

రోడ్డుపక్క ఆకుకూరలు అమ్ముకుంటాను. రోజుకు ఉద యం ఒకటి లేదా రెండు గంటలపాటే వ్యాపారం చేస్తా. దీనికి రూ.50 ఆశీలు పన్ను కట్టమని వేధిస్తున్నారు. ఆకు కూరల్లో మిగిలేదేంటి ? మా బతుకులేంటి ? మాకు ఇంత పన్నా ? అని ప్రశ్నించినా పట్టించుకోరు. పన్ను తగ్గించాలి.

- అన్నమ్మ, ఆకుకూరల వ్యాపారి



ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోరు

రోజూ రూ.60 కట్టించుకుంటున్నారు. గురువారం రూ.100 కట్టించుకుంటున్నారు. మాకు న్యాయం చేయాలి. రశీదులు ఇవ్వడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఇలాగే వసూలు చేస్తున్నారు.

-బాబూరావు, ఆకు కూరల వ్యాపారి



రూ.30 అదనంగా వసూలు

డిగ్రీ చదువుకున్నా ఎటువంటి ఉద్యోగం రాక పోవడంతో అమ్మకు తోడుగా ఆకు కూరలు అమ్ముకుని జీవిస్తున్నాం. వాస్తవానికి రూ.20 నుంచి రూ.25 కట్టాల్సిన పన్ను రూ.50 ఎటువంటి రసీదు లేకుండా కట్టించుకుంటున్నారు. అధికారులు న్యాయం చేయాలి.

- ఎం.వెంకటేశ్వరరావు, ఆకు కూరల వ్యాపారి



రశీదు లేకపోయినా..

ప్రతిరోజు రూ.50 పన్ను డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే రూ.100 అడుగుతున్నారు. ఇక చేసేదిలేక రూ.50లకు ఎలాంటి రశీదులు లేకుండా ఇస్తున్నాము.

- మోహనరావు, ఉల్లి వ్యాపారి

ఉన్నత విద్యలో 50 శాతం స్థూల నమోదు పెంపుదలే లక్ష్యం

- నన్నయ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



రాజమహేంద్రవరం/కాకినాడ, జనవరి 31 : ఉన్నత విద్యలో 2035 నాటికి స్థూల నమోదు నిష్పత్తిని 50 శాతం పెంచడమే జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యమని రాష్ట్ర గవర్నర్, నన్నయ విశ్వ విద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13,14,15 ఉమ్మడి స్నాతకోత్సవం బుధవారం వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గవర్నర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 900 విశ్వ విద్యాలయాలు, 40 వేల కళాశాలలతో ఉన్నత విద్యావిధానంలో భారతదేశం అతిపెద్ద నెట్‌వర్క్ కలిగి ఉందన్నారు. కానీ ఉన్నత విద్య స్థూల నిష్పత్తిలో మన దేశం కేవలం 27.29 శాతం మాత్రమే ఉందన్నారు. రానున్న 15 ఏళ్లలో ఉన్నత విద్యలో అరుదైన భాగస్వామ్యాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ముందుకెళుతున్నాయన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా సంపూర్ణ విద్యను మన రాష్ట్రం కూడా ప్రవేశపెట్టిందని, ఇందులో నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తి మాట్లాడుతూ మాతృభాషను తప్పక గౌరవించాలని, అలాగే సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలన్నారు. నన్నయ ఉపకులపతి ఆచార్య కె.పద్మ రాజు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి డాక్టరేట్‌లు అందజేశారు.

● ప్రజల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గవర్నర్, జేఎన్‌టీయూకే కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో కాకినాడ జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవం గవర్నర్ అధ్యక్షతన జరిగింది. ఈ వేడుకలకు మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్యఅతిథిగా విచ్చేయగా టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. జేఎన్టీయూకే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీఎస్సీహెచ్ఈ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, డైరెక్టర్లు, ఈసీ సభ్యులు, ప్రిన్సిపాల్స్ వేదికను అలంకరించారు.

ఎన్నికల బదిలీలు

ఏలూరుసిటీ, జనవరి 31: ఎన్నికల బదిలీలలో భాగంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు కొంతమందిని బదిలీ చేశారు. ఏలూరు జిల్లాకు సంబంధించి నూజివీడు ఆర్డీవోగా వై.భవానీశంకరిని నియమించారు. ఏలూరు తహసీల్దార్‌గా పనిచేస్తూ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన బి.సోమశేఖరరావును ఏలూరు విద్యాశాఖలోని సమగ్ర శిక్షకు అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా నియమించారు. డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటిని ఏలూరు పీఐపీఆర్ఎంసీ యూనిట్-2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఇక్కడ అదే పోస్టులో పనిచేసిన కె.గీతాంజలిని సింహాచలం ఎస్‌వీఎల్ఎన్ఎస్ దేవస్థానాల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ ప్రొటెక్షన్) గా బదిలీ చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విశాఖపట్నం ఏపీఐఐసీ (ఎల్ఏ)గా పనిచేస్తున్న టీఈఎం రాజును ఏలూరు హౌసింగ్ పీడీగా నియమించారు. కాకినాడ సివిల్ సప్లయిస్ డీఎంగా పనిచేస్తున్న డి.పుష్పమణిని ఏలూరు డీఆర్వోగా నియమించారు. ఇక్కడ డీఆర్వోగా పనిచేస్తున్న ఎం. వెంకటేశ్వర్లును మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వీసీగా నియమించారు.

ధాన్యం కమిషన్‌ను సొసైటీలకు అందించండి

ఏలూరు సిటీ, జనవరి 31 : జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి కమిషన్‌ను సొసైటీలకు అందించే చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార శాఖాధికారిని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగిన సలహా మండలి సమావేశంలో కలెక్టర్, జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కమిషన్ ఎఫ్‌డీ చేసే నిబంధన సడలించి సొసైటీలు గోనె సంచులు కొనుగోలు చేసుకునేలా కమిషన్ పూర్తిగా సొసైటీలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న పాలవెల్లువకు సంబంధించి ద్వారకా తిరుమల, దెందులూరు తదితర మండలాల్లో పీఎంఐజీపీ కింద యూనిట్ల స్థాపనకు లబ్ధిదారులు పది రోజుల్లోగా దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకోవాలని పశుసంవర్థక శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. జంగారెడ్డిగూడెం మండలం ఏ పోలవరంలో 100 ఎకరాల చిన్న పెద్ద చెరువుకు సంబంధించి సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో, తహసీల్దారును ఆదేశించారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన ఆయా అంశాల వారీగా సంబంధిత అధికారులు సమా చారాన్ని అందజేశారు. జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడారు. సమావేశంలో వ్యవసాయ సలహామండలి సభ్యులు, సంబధిత జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ ప్రచురించిన చిరుధాన్యాలతో వంద రకాల వంటలు పుస్తకాన్ని ఆవిష్కరించారు.

తుది ఓటర్ల జాబితాలో అభ్యంతరాలను తెలపండి..

ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే 4, 5 రోజుల్లో తెలపాలని రాజకీయ పక్షాల ప్రతినిధులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సూచించారు. ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో రమాదేవి, వివిధ రాజ కీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం 1,957 ఓటర్ల ఫొటోలలో నాణ్యత, 1,869 మరణించిన ఓటర్లు, 675 డూప్లికేట్లను గుర్తించి చర్యలు తీసుకున్నామన్నారు. ఫారం- 6 కింద 5,652, ఫారం-7 కింద 7,295, ఫారం- 8 కింద 5,428 మొత్తం 18,375 దరఖాస్తులు రాగా వాటిలో 6,564 పరిష్కరించగా మరో 11,537 పరిశీలనలో ఉన్నాయని, 274 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయన్నారు.

కల్లుగీత వృత్తిని నిర్వీర్యం చేస్తే ఊరుకోం


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తణుకు, జనవరి 31: కల్లుగీత వృత్తిని నిర్వీర్యంచేయాలని చూస్తే వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. కల్లుగీత కార్మిక సంఘం 15వ రాష్ట్ర మహా సభల్లో ఆయనమాట్లాడుతూ, మద్యపానం నిషేధించలేని ప్రభుత్వం, కల్లుగీతను నిషేధిస్తామనడం హాస్యాస్పదమన్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో 200 మంది గీత కార్మికులు మృతిచెందినా రూ.రెండు లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాల్సి ఉండగా ఏ ఒక్కరికి రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఐక్యతను దెబ్బతీసే కార్పొరేషన్‌ల వల్ల ఒరిగిందేమి లేదని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ అన్నారు. ఎన్నికల్లో గీతన్నల సత్తా ఏంటో చూపిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేవముడు చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి, కామన మునిస్వామి, గుబ్బల నాగమణి, బాస్కరయ్య, చంద్రప్రసాదు, మట్టా వెంకట్, పీవీ ప్రతాప్, కేతా గోపాలన్ పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కన్వర్టెడ్ క్రిస్టియన్స్

కులగణనలో కన్వర్టెడ్ క్రిస్టియన్లకు అన్యాయం

కాళ్ళ, జనవరి 31 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వేలో కన్వర్టెడ్ క్రిస్టియన్లకు అన్యాయం జరుగుతుందని ఫ్రీడమ్ ఫర్ క్రిస్టియన్ ఇంటిగ్రేడ్ (ఎఫ్ఎఫ్‌సీఐ) రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. ఇస్మాయేల్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం కన్వర్టెడ్ క్రిస్టియన్స్ ఆందోళన చేశారు. ఇస్మాయేల్ మాట్లాడుతూ, పశ్చిమగోదావరి జిల్లాలో కులగణన సర్వే పారదర్శకంగా లేదన్నారు. అధికారులు, వలంటీర్లు ఇంటింటికి తిరిగి కులగణన చేయాల్సి ఉన్నా అది జరగడం లేదని అన్నారు. వలంటీర్లు ఫోన్లు చేసి ఓటీపీలను నమోదు చేసుకోవడం దారుణమని పేర్కొన్నారు. సర్వేలో క్రిస్టియన్ మతం అని నమోదు చేయడం లేదని ఆరోపించారు. మండలంలో కులగణన రీసర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అనంతరం ఎంపీడీవో ఎం.ఎస్. ప్రభాకరరావు, తహసీల్దార్ టీపీ కృష్ణారావులకు వినతి పత్రాలు అందజేశారు. కన్వర్టెడ్ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి.ఎస్.సుందరరావు, కన్వీనర్ వై.సాల్మన్‌రాజు, సురేష్‌బాబు, విజయ్‌కుమార్, పురుషోత్తం, హేమకుమార్, సురేష్‌పాల్, క్రైస్తవ సంఘాల నేతలు పాల్గొన్నారు.

జంతర్‌మంతర్ దీక్షలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ముప్పాళ్ళ

భీమవరం అర్బన్, జనవరి 31: రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలు కోరుతూ ఈనెల ఆరు, ఏడు, ఎనిమిది తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద హోదా సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో బుధవారం సీపీఐ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లబోయిన రంగారావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిన మోదీని గద్దెదించే సమయం ఆసన్నమైందని ముప్పాళ్ళ అన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రజాకంటక పాలనకు చరమగీతం పాడాలన్నారు. పచ్చని పశ్చిమ గోదావరి జిల్లా నేడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లిందని, ఆక్వా రంగం కుదేలయిందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు ఆదుకోవాలని, ఫించన్లు ముడువేల నుంచి ఆరు వేలకు, దివ్యాంగులకు రూ.ఏడువేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, నెక్కంటి సుబ్బారావు, ఎం. సీతారం ప్రసాదు పాల్గొన్నారు.

కొల్లేరును రక్షించుకుందాం


సీడీ ఆవిష్కరిస్తున్న మల్లాడి, విమలక్క తదితరులు

ఏలూరు రూరల్, జనవరి 31: ఏలూరు జిల్లాలో సహజసిద్ధంగా ఏర్పడిన మంచినీటి సరస్సు కొల్లేరు.. లక్షకుపైగా ఎకరాల్లో వ్యాపించి ఉంది.. ప్రకృతి అందాలకు, అరుదైన వలసపక్షులకు, ఎన్నోరకాల చేపలకు నిలయం.. దీన్ని కాపాడుకుందామని, ఇక్కడి ప్రజలను రక్షించుకుందామని, ఇందుకోసం తనవంతు కృషిచేస్తానని పాండిచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. కొల్లేరు పరిరక్షణ ఉద్యమకారిణి ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కొల్లేరు బతుకుచిత్రంపై అరుణోదయ విమలక్క గానం చేసిన సీడీని బుధవారం వైఎమ్‌హెచ్‌ఏ ప్రాంగణంలో కొల్లేరు సాహితివేత్త చింతపల్లి వెంకటనారాయణ ఆవిష్కరించారు. మల్లాడి మాట్లాడుతూ, కొల్లేరు ఆపరేషన్ తరువాత ఎంతోమంది నిరాశ్రయులయ్యారన్నారు. బతుకుదెరువుకు వలసలు పోయారని వారికి నష్టపరిహారం అందించాలని కోరారు. కొల్లేరు పర్యావరణ, జీవనోపాధి దెబ్బతినకుండా తనవంతు కృషిచేస్తానన్నారు. బీసీ-1లో ఉన్న మత్స్య కారులను 37వ నెంబర్‌లోకి మార్చారని దీన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళదామన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, కొల్లేరు పరిరక్షణకు ఐకమత్యంగా పోరాడదామన్నారు. పలువురు మాట్లాడుతూ సాంప్రదాయ చేపలవేటను, సంస్కృతిని గుర్తించి మెరుగైన విద్య, స్థానికులకే ఉపాధ్యాయ పోస్టులు, ఉప్పుటేరు వద్ద వాటర్ రెగ్యులేటర్ నిర్మించాలని,కొల్లేరు ఎడారిగా మారకుండా ఐదు అడుగులు లోతు నీరు ఉండేలా చూడాలని, వలసల నివారణ, కొల్లేరు ప్రక్షాళన ఏకకాలంలో జరిగేలా ముందుకు సాగుదామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, పార్టీలకతీతంగా ఏర్పాటుచేసిన సభలో ఓ నాయకుడు మూడో కాంటూరు చంద్రబాబుతో సాధ్యమని మాట్లాడటంతో వైసీపీ నాయకులు ఖండించారు. కొద్దిసేపు సభ ఉత్కంఠగా సాగింది. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ కమిటీలో మాదిగలకు అన్యాయం


మాట్లాడుతున్న పసుపులేటి చినబాబు

పాలకొల్లు రూరల్, జనవరి 31:పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన కమిటీని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు ప్రకటించారనీ, దీనిలో మాదిగలు ఒక్కరు కూడా లేరని, ఎస్సీ కోటాలో నలుగురు డైరెక్టర్లను మాల సామాజిక వర్గానికి కేటాయించి మాదిగలకు అన్యాయం చేశారని ఎమ్మార్పీఎస్ పశ్చిమ గోదావరి జిల్లా వర్కింగ్ ప్రెసెడెంట్ పసుపులేటి చినబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకొల్లు బెత్లెహంపేటలో బుధవారం ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. పాలకొల్లు టౌన్, పాలకొల్లు రూరల్, యలమంచిలి, పోడూరు మండలాల ఎస్సీసెల్ అధ్యక్షులను నలుగురిని ఎస్సీ మాల సామాజిక వర్గానికి కేటాయించి కనీసం మాదిగలకు ప్రాతినిధ్యం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో కూడా నియోజకవర్గంలో మాదిగలకు స్థానం లేకుండా చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో వైసీపీకి మాదిగలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్దంగా ఉన్నారన్నారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండేటి వరదరాజు పాల్గొన్నారు.

నేత్రపర్వం .. చాత్మార్‌సేవ


క్షేత్రపురవీధుల్లో ఊరేగుతున్న స్వామి

ద్వారకాతిరుమల, జనవరి 31: ఉభయదేవేరులతో చినవెంకన్నకు బుధవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో జరిగిన చాత్మార్‌సేవ భక్తులను అలరించింది. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లను తొళక్కవాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా అట్టహాసంగా తిరువీధులకు తీసుకొచ్చారు. ప్రతీ ఇంటిముందు భక్తులు స్వామి వారి మూర్తులకు హారతులు పట్టారు.

శునకాల స్వైరవిహారం.. 9 మందికి గాయాలు

నరసాపురం రూరల్, జనవరి 31: మండలంలోని సారవ గ్రామంలో బుధవారం శునకాలు స్వైరవిహారం చేసి తొమ్మిది మందిని గాయపరిచాయి. ఉదయం ఇళ్ల, పొలాల వద్ద పని చేసుకుంటున్న సమయంలో కుక్కలు వారిపై దాడి చేశాయి. బాధితులకు ఎల్‌బిచర్ల పీహెచ్‌సీ, నరసాపురం ఆస్పత్రి వైద్య సిబ్బంది వ్యాక్సిన్లు వేశారు. అదే సమయంలో రెండు మేకలపై కూడా దాడి చేశాయి.

ఆధునిక సాగు అదుర్స్!

- తగ్గిన పెట్టుబడి.. సమయం ఆదా
- కూలీల కొరత తీరుస్తున్న వైనం
- పొగాకు, మిర్చిపై అన్నదాతల మొగ్గు



జీలుగుమిల్లి, జనవరి 31 : సంప్రదాయ సాగును పక్కనబెట్టి ఆధునిక పద్ధతుల్లో వాణిజ్య పంటలను సాగు చేస్తుండడంతో పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాక, సమయం ఆదా అవుతోంది. కూలీల కొరతను అధిగమించడంతో పాటు దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో కొందరు అన్నదాతలు ఆధునికంపై మొగ్గుచూపుతున్నారు. పంటలు ప్రకృతి వైపరీత్యాలను కొంతమేర తట్టుకుని రైతుకు మేలు చేకూరుస్తున్నాయి.

పి.రాజవరానికి చెందిన రైతు గూడపాటి పుల్లయ్య ఈ ఏడాది 50 ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. ఓ వైపు వాతావరణ పరిస్థితులు, మరోవైపు కూలీల కొరత, ఏ పంట సాగు చేసినా గిట్టుబాటు కాని పరిస్థితి. అయితే తనదైన రీతిలో పొగాకు సాగులో కూలీలు తగ్గింపు, పంటలో అంతర కృషి (కలుపు నివారణ, పైపాటు) వంటి పనుల్ని సులభంగా అధిగమించారు. పురుగుమందులు స్ప్రే చేసేందుకు ఎకరానికి సుమారు రూ.800 కూలీలకు ఖర్చు చేస్తుంటే.. పుల్లయ్య డ్రోన్ సాయంతో రోజుకు 10 ఎకరాల వరకు స్ప్రే చేస్తున్నారు. 35 రూపాయలతో ఏడు నిమిషాల్లో ఎకరం పంటకు డ్రోన్ స్ప్రే చేస్తుంది. ఈ పరికరాన్ని ఐటీసీ ద్వారా అద్దెకు తెస్తున్నారు. పురుగు మందు సాధారణంగా మనుషులు స్ప్రే చేస్తే ఎకరానికి రూ.3,000 ఖర్చు అవుతుండగా, డ్రోన్ ద్వారా 50 శాతం మందు ఆదా అవుతుండడంతో ఎకరానికి రూ.1500 మాత్రమే వెచ్చిస్తున్నారు. పంటకు మల్చింగ్ (పాలిథిన్ కవర్ వేసి మధ్యలో రంధ్రాలు చేసి పొగాకు నాటటం) వేసి డ్రిప్ ఏర్పాటు చేశారు. దీంతో కూలీలు, తడి పెట్టే ఖర్చు రెండు తగ్గాయి. మల్చింగ్ షీట్ ఏర్పాటుకు ఎకరానికి రూ.3,500 ఖర్చు అవుతుంది.

ప్రకృతి వైపరీత్యాల్ని తట్టుకుని..

మిచౌంగ్ తుపాన్‌కు రైతులు తీవ్రంగా నష్టపోయారు. మల్చింగ్ ద్వారా రైతులకు కొంత మేలు జరిగింది. వరద ప్రవాహానికి మొక్కలు కొట్టుకు పోకుండా నిలిచాయి. చీడపీడల్ని తట్టుకుని ఆరోగ్యంగా పెరుగుతుంది. డ్రోన్ ద్వారా పురుగు మందులు, డ్రిప్ ద్వారా తడులు అందించడంతో పెట్టుబడి తగ్గుతుంది.

మిర్చి పంటలో సోలార్ దీపం..

ఉదయ్ భాస్కర్ కాలనీకి చెందిన చిలకా నాగేశ్వరావు మిర్చి పంటలో పురుగు మందుల వాడకం తగ్గించారు. ఎకరానికి నాలుగు చోట్ల సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు. పంట పాడు చేసే పురుగులు రాత్రి సమయంలో సోలార్ దీపం వెలుగు వద్దకు వచ్చి దానికి ఏర్పాటు చేసిన గమ్ బేసిన్‌లో పడి చనిపోతాయి. ఏటా పురుగు మందులకు ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.70 వేలు వరకు వాడేవారు. పురుగు మందులు వాడకుండా సోలార్ దీపపు ఎర ఏర్పాటు ద్వారా చీడపీడలు నివారిస్తున్నారు. ఈ దీపాలు పగటి పూట సూర్యరశ్మిని స్వీకరించి రాత్రి సమయంలో వెలుతురు ఇస్తాయి.


> **ఖర్చు తగ్గుతుంది..**
> గత ఏడాది మిర్చి, కూరగాయల పంటల్లో సోలార్ దీపాలు ఏర్పాటును భద్రా చలం, చర్ల సమీపంలో తెలంగాణ వైపు ప్రాంతాల్లో చేపట్టారు. ఒక్కొక్క దీపం రూ.1,350. ఎకరానికి మూడు సోలార్ లాంతర్‌లు (దీపాలు) ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది. ఆ తర్వాత ఖర్చు ఉండదు.
> -చిలకా నాగేశ్వరరావు, మిర్చి రైతు - ఉదయ్‌భాస్కర్ కాలనీ


మిర్చిలో పురుగులకు ఎరగా ఏర్పాటు చేసిన సోలార్ దీపం

ఓటర్ల తుది జాబితా..తప్పుల తడక!

మృతులు బతికే ఉన్నట్టుగా..

టి.నరసాపురం, జనవరి 31 : మండలంలోని కె.జగ్గవరంలో ఓటర్ల తుది జాబితాలో తప్పులు దొర్లాయి. గ్రామానికి సంబంధం లేని ఇద్దరు వ్యక్తులకు ఓటు హక్కు కల్పించడంతో పాటు మరో నలుగురికి రెండేసి ఓట్లు, మృతి చెందిన కొందర్ని ఓటర్ల జాబితాలో బతికే ఉన్నట్లు చూపించారు. తుది జాబితా ప్రకారం మండలంలో మొత్తం ఓటర్లు 45,725 మంది. పురుషులు 22,700, స్త్రీలు 23,025 మంది. 15 పంచాయతీలు ఉండగా కె.జగ్గవరంలో ఓటర్ల తుది జాబితాను పరిశీలిస్తే ఇన్ని తప్పులు ఉన్నాయి. మండల వ్యాప్తంగా ఓటర్ల జాబితా పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. 85వ పోలింగ్ బూత్ పరిధిలో సీరియల్ నెంబరు 1093లో బొంతు కావ్యశ్రీ ఉన్నారు. ఆమె ఈ గ్రామానికే చెందినది కాదు. అయినప్ప టికీ ఆమెకు ఓటు కల్పించారు. సీరియల్ నెంబరు 1362లో పెనుమానూరి తిరుపతి స్వామి కూడా ఈ గ్రామానికి చెందిన వారు కాదు. ఈయనకు ఓటు ఉంది. 85వ పోలింగ్ బూత్ పరిధిలో నాగాబత్తుల దీవెనమ్మకు సీరియల్ నెంబరు 944, మరో ఓటు 1308లలో చంటి అనే పేరుపై ఓట్లు కలిగిఉంది. జాయ్‌ప్రైస్ ఎస్తేర్ లింగారెడ్డికి సీరియల్ నెంబరు 1333తో పాటు 1310లో కూడా ఓటు ఉంది. సీరియల్ నెంబరు 1332లో వేమూరి లావణ్య (తండ్రి- పేరు కేశవరావు) అని, సీరియల్ నెంబరు 1345లో కూడా లావణ్య వేమూరి (ఇతరులు-ఆది) అని రెండు ఓట్లు ఉన్నాయి. సీరియల్ నెంబరు 1346 లావణ్య తేలె ఓటరు జాబితాలో సీరియల్ నెంబరు 1347లో కూడా లావణ్య తేలె ఉంది. ఫోటో ఉండాల్సిన చోట ఆధార్ కార్డు ఫోటో వచ్చింది.


1310 | 4 | TRC1829209
ఇంటి సంఖ్య : 2-79
వయస్సు : 31 లింగము : స్త్రీ
1333 | 5 | TRC1887041
ఇంటి సంఖ్య : 2-79
వయస్సు : 31 లింగము : స్త్రీ

ఓటు కోసం దరఖాస్తు చేసిన కె.జగ్గవరంనకు చెందిన గోరింకల శ్రీరాజు, గోరింకల సౌమ్య, పరసా కావ్య జయవరపు శ్యామల సుచిత్ర నలుగురి పేర్లు మాత్రం తుది జాబితాలో రాలేదు. ఓటర్ లిస్టులో డోర్ నెంబర్‌లకు బదులుగా ఊరి పేర్లు దర్శనమిచ్చాయి. కె.జగ్గవరంలో సీరియల్ నెంబరు 24 బొడ్డపాటి ప్రసన్నకు ఓటర్ లిస్టులో ఇంటి నెంబరుకు బదులు శ్రీరామవరం అని ఉంది. సీరియల్ నెంబరు 25 దేవరకొండ పుణ్యేశ్వరావు ఇంటి సంఖ్య బదులు కేతవరంగా నమోదైంది. ఒకే ఇంట్లో ఉండే కుటుంబ సభ్యులకు ఓట్లు వేర్వేరు వార్డుల్లోకి వెళ్లగా వారి ఇంటి నెంబరుపై సంబంధం లేని వ్యక్తులకు ఇంటి డోర్ నెంబర్ ఇచ్చి ఓటు కల్పించారు. సీరియల్ నెంబర 696లో ఒంటిపల్లి లక్ష్మీకాంతం సుమారు రెండు సంవత్సరాల క్రితం మృతి చెందింది. సీరియల్ నెంబరు 437లో మొండు జగన్మోహన్‌రెడ్డి రెండు నెలల క్రితం, సీరియల్ నెంబరు 907లో బండి భూషణం ఏడు నెలల క్రితం మృతి చెందాడు. సీరియల్ నెంబరు 961లో బత్తుల దేవమాత సంవత్సరం క్రితం మృతి చెందారు. వీరందరూ తుది జాబితాలో ఓటర్లుగా ఉన్నారు.

నాడు-నేడు పనులకు బిల్లు చెల్లించలేదని..
మొగల్లులో పాఠశాలకు తాళం

- ఆరుబయటే నిలబడిన ఉపాధ్యాయులు, విద్యార్థులు
- కాంట్రాక్టర్‌తో మాట్లాడిన ఎంఈవో .. అరగంట ఆలస్యంగా తెరుచుకున్న స్కూల్


ఆరుబయట కూర్చున్న చిన్నారులు.. (ఇన్‌సెట్) పాఠశాలకు తాళం

పాలకోడేరు, జనవరి 31 : చేసిన పనులకు డబ్బులు చెల్లించడం లేదంటూ పాఠశాలకే తాళం వేసిన ఘటన అల్లూరి సీతారామరాజు పుటిటిగడ్డ అయిన మొగల్లులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..నాడు-నేడు పనుల్లో భాగంగా స్పెషల్ ఎలిమెంటరీ పాఠశాలో బాత్రూమ్ పనులను ఓ కాంట్రాక్టర్ చేపట్టారు. ఎస్టిమేషన్ ప్రకారంగా రూ.15,000 మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ ఆ పనులకు రూ.33 వేలు ఖర్చు అయిందంటూ లెక్కలు చూపించాడు. రూ.15 వేలు మాత్రమే మంజూరు అయ్యాయని ఇంజనీరింగ్ అసిస్టెంట్ చెక్కు అందించారు. మిగిలిన సొమ్ము ఎవరు ఇస్తారంటూ ఆ కాంట్రాక్టర్.. ఇంజనీరింగ్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుడు సింహాచలంను ప్రశ్నించారు. తానేం చేస్తానని హెచ్‌ఎం కొంతకాలంగా సమాధానం ఇస్తూ వచ్చారు. ఆగ్రహించిన కాంట్రాక్టరు సహాయకుడు బుధవారం పాఠశాలకు తాళం వేశాడు. దీంతో స్థానికులు ఎంఈవో నాగరాజు దృష్టికి తీసుకువెళ్లారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి తాళం తెరిపించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

దీనిపై ఎంఈవోను వివరణ కోరగా, పనులు చేయడం వాస్తవమేనని, పాఠశాలకు తాళం వేయడం మంచి పద్ధతి కాదని చెప్పడంతో అరగంట ఆలస్యంగా ఉదయం 9.30 గంటలకు పాఠశాల తెరిచినట్టు తెలిపారు.

క్రైం కార్నర్

చెల్లెలు అదృశ్యంపై ఫిర్యాదు

ఆకివీడు, జనవరి 31: చెల్లెలు అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలివి. విజయవాడ బట్టల దుకాణంలో పనిచేస్తున్న చెల్లెలు స్థానిక వారపు సంతలో ఉంటున్న అక్క ఇంటికి రెండు రోజులు క్రితం వచ్చింది. మంగళవారం రాత్రి వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెదికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో అక్క ఫిర్యాదు చేసింది. చెల్లెలు కనబడుటలేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

మహిళపై బాలుడి అత్యాచారం

భీమవరం క్రైం, జనవరి 31 : బహిర్భూమికి వెళ్లిన ఓ మహిళ(25)పై ఓ బాలుడు(16) అత్యాచారం చేసిన ఘటన ఇది. వివరాలివి. తాడేరు గ్రామానికి చెందిన మహిళ బుధవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లింది. అక్కడే కాపుకాసిన ఓ బాలుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మహిళ బంధువుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

మహిళను మోసగించిన యువకుడిపై కేసు

ఏలూరు క్రైం, జనవరి 31 : ప్రేమించానని మాయమాటలు చెప్పి.. గర్భిణిని చేసి ఆపై ఆ గర్భాన్ని విచ్ఛిన్నం చేసి పెళ్లికి నిరాకరించాడంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. ఏలూరు టైటస్‌నగర్‌కు చెందిన పిల్లగ్రోవుల చిన్ని (20) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అతడికి దూరపు బంధువైన యువతి (23)తో సన్నిహితంగా ఉండేవాడు. ప్రేమ పేరుతో ఆమెను లోబర్చుకుని గర్భం చేశాడు. మందులు ఇచ్చి గర్భం విచ్ఛిన్నం చేశాడు. వివాహానికి నిరాకరించడంతో ఆ యువతి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. చిన్నతో వివాహం చేయాలని ఆ యువతి అతడి ఇంటి ముందు ధర్నా చేపట్టింది.

ఇదిలా ఉండగా, ఆమెకు అంతకు ముందే మరో వ్యక్తితో వివాహమైందని, బిడ్డకు కూడా జన్మనిచ్చిందని యువకుడి బంధువులు, స్థానికులు చెబుతున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

ఊరెళ్లి వచ్చేలోగా.. ఇల్లు దోచేశాడు..

ఏలూరు క్రైం, జనవరి 31 : ఊరెళ్లి వచ్చేసరికి ఇంటితాళాలు పగులగొట్టి బంగారు, వెండి వస్తువులు, నగదు అపహరించుకుపోయిన ఘటన ఇది. సత్రంపాడు బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్న జక్కంపూడి సీతారామయ్య ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. తిరిగి బుధవారం వచ్చేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. తొమ్మిది కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.50 వేల నగదు దొంగలు అపహరించుకుపోయాడు. బాధితుడు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

వీరవాసరం, జనవరి 31: ద్విచక్ర వాహనాల దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరు మోటారుబైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి. వీరవాసరం రైల్వేగేట్ వద్ద హెల్మెట్ చెకింగ్, వాహన తనిఖీలు చేస్తున్నారు. పోలీసులను చూసి నవుడూరు నుంచి వీరవాసరం వస్తున్న వ్యక్తి మోటారుబైక్ వెనుకకు తిప్పి వెళ్లిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. మడుగుపోలవరం పంచాయతీ జొన్నలపాలెం-1కి చెందిన వేండ్ర చంద్రశేఖరరావుగా గుర్తించారు. నిందితుడు గతంలో మూడు నెలలు జైలుశిక్ష అనుభవించాడని ఎస్‌ఐ పి.రమేష్ తెలిపారు. గత డిసెంబరులో వీరవాసరంలో కొంతం సత్యనారాయణ మోటారుసైకిల్‌ను, నందమూరుగరువు భక్తాంజనేయస్వామి ఉత్సవాల్లో రెండు మోటారుబైక్‌లను అపహరించాడు. నిందితుడి వద్ద ఉన్న బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభచూపిన సీఐ సత్యకిషోర్, ఎస్‌ఐ రమేష్, పోలీసు సిబ్బందిని ఎస్పీ ఉప్పాడ రవిప్రకాశ్, డీఎస్పీ బి. శ్రీనాథ్ అభినందించారు.

వైద్యం వికటించి చిన్నారి మృతి

- బంధువుల ఆందోళన



మృతదేహంతో ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగిన బంధువులు

నూజివీడుటౌన్, జనవరి 31: వైద్యం వికటించి ఓ చిన్నారి మృతిచెందిన విషయమై పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే .. ఆర్.ఆర్‌పేటకు చెందిన వేముల రంగబాబు కుమారుడు యశ్వంత్‌శ్రీరామ్(11) మూడురోజుల క్రితం కాలికి గాయమవడంతో తుమ్మలవారివీధిలో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు మందులు ఇచ్చి పంపారు. ఛాతిలో నొప్పి అంటూ తిరిగి బుధవారం ఉదయం ఆసుపత్రికి తీసుకురాగా పరీక్షలు చేసిన వైద్యులు ఇన్‌ఫెక్షన్ ఉందని చెప్పారు. చిన్నారికి ఇంజక్షన్ ఇవ్వగా ఇంటికెళ్లేసరికి శరీరం మొత్తం నీలం ఛాయకు మారింది. దీంతో తిరిగి చిన్నారిని వైద్యం చేసిన ఆసుపత్రికి తల్లిదండ్రులు తీసుకువచ్చారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో తక్షణం విజయవాడకు తీసుకువెళ్లాలని వైద్యులు పేర్కొంటూ మరోరెండు ఇంజక్షన్‌లు ఇచ్చి పంపారు. ఆసుపత్రి నుంచి బయటకు వచ్చి చిన్నగాంధీబొమ్మ సెంటర్ దాటే సమయానికే చిన్నారి పరిస్థితి మరింత దిగజారడంతో స్థానికంగా ఉన్న మరో ఆసుపత్రికి చిన్నారిని తీసుకువెళ్లామని అయితే అక్కడ పూర్తిస్థాయి వైద్యసేవలు అందించేలోపే శ్రీరామ్ మృతిచెందాడంటూ బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం వికటించడంతోనే పిల్లాడు మృతిచెందాడంటూ చిన్నారి బంధువులు, ఆర్.ఆర్‌పేట వాసులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని చిన్నారి మృతికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

మృతదేహంతో ఆసుపత్రి వద్ద నిరసన

తొలుత వైద్యం అందించిన ప్రైవేట్ ఆసుపత్రి వద్దకు యశ్వంత్‌రామ్ మృతదేహాన్ని తీసుకువచ్చిన బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యులు ఇచ్చిన ఇంజక్షన్ వల్లే పరిస్థితి విషమించి బాలుడు మృతిచెందాడని, న్యాయం చేయాలని తల్లిదండ్రులు, బంధువులు, రామాయమ్మరావు పేట వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ సీఐ ఎం.వి.వి.ఎస్.ఎన్ మూర్తి, వైద్యవివరాలు, ఇతర అంశాలపై వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. చిన్నారి మృతిచెంది దాదాపు మూడు గంటలు గడుస్తున్నా వైద్యులపై చర్యలు తీసు కోకుండా ఉపేక్షిస్తున్నారంటూ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఫిట్ ఇండియా విజేతలకు బహుమతులు


మాట్లాడుతున్న ఉదయ్ సందీప్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 31: ఫిట్ ఇండియాలో భాగంగా బుధవారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో డిగ్రీ, పీజీ విద్యార్థినులకు స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. సాయ్ జిల్లా ఇన్‌చార్జ్‌లు వినాయకప్రసాద్, ఉదయ్‌సందీప్ మాట్లాడుతూ, కేంద్ర క్రీడామంత్రిత్వశాఖ, ఖేలో ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏటా పోటీలు నిర్వహిస్తోందని వివరించారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ మాట్లాడుతూ, వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కబడ్డీ, వాలీబాల్, వ్యాసరచన, షాట్‌పుట్ విజేతలకు బహుమతులందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సీ, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ సెలీన్‌రోజ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా కార్యదర్శి డి.ప్రసాద్, నేషనల్ హాకీ క్రీడాకారుడు షేక్ అజీమ్, వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ మరియాక్రిస్టియా పాల్గొన్నారు.

జూడోలో సింహాద్రికి బంగారు పతకం


సింహాద్రిని అభినందిస్తున్న జగపతిరాజు

భీమవరం రూరల్, జనవరి 31 : విజయవాడలోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 30న జరిగిన జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజియట్ జూడో పోటీల్లో తమ ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం సివిల్ ఇంజనీరింగ్ చదువుతున్న దొండపాటి సింహాద్రి గోల్డ్ మెడల్ సాధించారని డైరెక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన అభినందన సభలో సింహాద్రిని కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు సత్కరించారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్. హరిమోహన్ మాట్లాడుతూ, ఫిబ్రవరి ఐదు, ఆరు తేదీల్లో అమృత్ సర్‌లో గురునానక్ విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయస్థాయి జూడో పోటీలకు జేఎన్‌టీయూకే టీమ్ తరుపున సింహాద్రి ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.బిహెచ్‌విఎస్ రామకృష్ణంరాజు అభినందించారు.

పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి


ఉండిలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ రాంసుందర్‌రెడ్డి

ఉండి/అత్తిలి, జనవరి 31: పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగ వంతం చేయాలని జాయింట్ కలెక్టరు ఎస్.రాంసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉండి-1 గ్రామ సచివాలయ పరిధిలోని ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను బుధవారం ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ప్రభుత్వ ఫార్మెట్ ద్వారా లబ్ధిదారులను హక్కు దారులుగా చేర్చాలన్నారు. పర్యవేక్షణకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఆర్డీవో శ్రీనివాసులరాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత మాధూర్, శ్రీనివాస్, ఎంపీడీవో ఎస్.రవీంద్ర, డిస్ట్రిక్ మేనేజరు భార్గవ్ రామ్ పాల్గొన్నారు. అత్తిలిలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చిన ఫార్మెట్లను జేసీ స్వయంగా పరిశీలించి అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆన్‌లైన్‌లో లాగిన్ పూర్తి అయిన వెంటనే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ మొదలుపెట్టాలని సూచించారు. తహసిల్దార్ రామాంజనేయులు, డిస్ట్రిక్ట్ మేనేజర్ భార్గవరామ్ పాల్గొన్నారు.

టీబీ నియంత్రణ సంస్థలో నిబంధనల మేరకే పోస్టుల భర్తీ

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 31 : ఉమ్మడి జిల్లా క్షయ నియంత్రణ సంస్థ గతేడాది చేపట్టిన వివిధరకాల కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా టీబీ కంట్రోల్ యూనిట్‌లో ఎన్‌హెచ్‌ఎం స్కీంలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సీనియర్ టీబీ సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్, టీబీ హెల్త్ విజిటర్ పోస్టుల భర్తీకి 2022 ఆగస్టులో అప్పటి టీబీ నియంత్రణాధికారిణి డాక్టర్ రత్నకుమారి నోటిఫికేషన్ జారీచేశారు. గతంలో హెల్త్ విజిటర్‌గా పని చేస్తున్న ఓ ఉద్యోగి విధి నిర్వహణలో మరణించారు. ఈ పోస్టును భర్తీ చేయడానికి కొత్తగా నోటిఫికేషన్ జారీచేయకుండా 2022లో జారీఅయిన నోటిఫికేషన్‌లో హెల్త్ విజిటర్ ఉద్యోగానికి దరఖాస్తుచేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్టు నుంచి రోస్టర్ పాటించకుండా అనర్హులైన అభ్యర్థిని ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండానే నియమించారని, రూ.లక్షలు చేతులుమారాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ప్రస్తుత టీబీ నియంత్రణాధికారి డాక్టర్ నాగేశ్వరరావును వివరణకోరగా 'టీబీ హెల్త్ విజిటర్ పోస్టులు మూడింటిని భర్తీచేయడానికి నోటిఫికేషన్‌ను జారీచేయగా 63మంది దరఖాస్తుచేసుకున్నారు. ఒక్క పోస్టు మాత్రమే భర్తీ అయింది. నిబంధనల ప్రకారం నోటిఫికేషన్‌కు గడువు/కాలపరిమితి ఏడాది ఉంటుంది. ఆ ప్రకారం గతేడాది డిసెంబరు 21 వరకు గడువు ఉంటుంది. అప్పటి టీబీ నియంత్రణాధికారిణి రత్నకుమారి మిగిలిన రెండుపోస్టులను మెరిట్‌లిస్టులో తదుపరి అర్హులైన అభ్యర్థులతో భర్తీచేసేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు, కలెక్టర్ నుంచి గతేడాది ఆగస్టు 9న అప్రూవల్ తీసుకున్నతర్వాతే నియామకాలను పూర్తిచేశారు. ఇందులో ఎక్కడా అక్రమాలు, అవినీతికి ఆస్కారం లేదు' అని వివరించారు.

గౌరవ వేతనంపై టీచర్ పోస్టుల భర్తీ ప్రతిపాదన విరమించుకోవాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 31 : ఉపాధ్యాయ నియామకాల్లో రెండేళ్ల గౌరవ వేతనంతో పనిచేసే ప్రతిపాదనలతో డీఎస్సీ రిక్రూట్‌మెంట్ చేపడుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు బుధవారం ఓ ప్రకటనలో తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. అన్ని అర్హతలున్నా గతంలో అప్రంటీస్ పేరుతో రెండేళ్లపాటు వెట్టిచాకిరీచేయించుకున్న ప్రభుత్వం మళ్లీ గౌరవవేతనం పేరుతో అదే విధానాన్ని తాజా నిర్ణయంతో తెచ్చిపెట్టినట్టయిందని ఆరోపించారు. ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 50వేల టీచరు పోస్టులు ఖాళాగావుంటే కేవలం 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామనడం సరికాదన్నారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిదే విజయం



అమీనాపేటలో జనసేన నేతల పాదయాత్ర

ఏలూరు కార్పొరేషన్, జనవరి 31: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం ఖాయమని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పల నాయుడు అన్నారు. అమీనాపేటలోని బుధవారం జనసేన పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ విధానాలను వివరిస్తూ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. నగిరెడ్డి కాశీ నరేష్, జగపతి మనోహరం స్వామి, సిరిపల్లి ప్రసాద్, ఒబిలిశెట్టి శ్రావణకుమార్ గుప్త, సరిది రాజేష్, పల్లి విజయ్, అల్లు సాయిచరణ్, కావూరి వాణిశ్రీ, కుర్మా సరళ, తుమ్మపాల ఉమాదుర్గ, ప్రమీలారాణి, జొన్నలగడ్డ సుజాత, దుర్గాబేబి, గాయత్రిపావని, జక్కా లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ చేసిన కలెక్టర్



గోదాం పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు సిటీ, జనవరి 31: ఎన్నికల సామాగ్రి భద్రపరిచే గోదాంను సాధారణ తనిఖీ ప్రక్రియలో భాగంగా పరిశీలించినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో ఈవీఎం యంత్రాలు, వీవీప్యాట్‌లు భద్రపరిచే గోదాంను బుధవారం ఆయన సందర్శించి సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల రక్షణ, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాం క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు.

వీధి బాలలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి మధుబాబు

చింతలపూడి, జనవరి 31: సమాజంలో వీధి బాలలను వదిలివేయవద్దని, వారిని స్వచ్ఛంద సంస్థలు లేదా చిల్డ్రన్ హోంలకు తరలించి ఆదుకోవాలని న్యాయాధికారి సి.మధుబాబు అన్నారు. వీధి బాలల దినోత్సవం సందర్భంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రులు కోల్పోయి కొందరు, ఆర్థిక పరిస్థితుల వలన ఇంకొందరు, కుటుంబాల్లో గొడవతో ఇంకొందరు పిల్లలు వీధిన పడుతున్నారన్నారు. వీధిన పడిన పిల్లలను వదిలేస్తే జీవితాలు పాడవుతాయన్నారు. బాలల చట్టాలు, నిర్బంధ విద్యాహక్కు, తదితర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు డేవిడ్‌రాజు, ఉమర్ ఫరూఖ్, ఎండీ.అక్బర్ ఆలీ, ప్రిన్సిపాల్ సోమసుందరరావు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన రేషన్ డీలర్లు



రేషన్‌డీలర్ల సంఘ ప్రతినిధులు

ఏలూరు రూరల్, జనవరి 31: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని జిల్లా రేషన్ డీలర్లు బుధవారం కలసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఐదేళ్లుగా ఒక్క రూపాయి కమిషన్ పెంచలేదని, కొవిడ్ సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి సరుకులు పంపిణీ చేశామని చెప్పారు. చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లపాటు ఉచిత బియ్యం పంపిణీ ప్రకటించడంపై ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. పురందేశ్వరిని కలిసిన వారిలో రేషన్ డీలర్స్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, తదితరులు ఉన్నారు.

పంచాయతీల్లో డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటుచేయాలి



ఐటీడీఏ ఏపీవోకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

బుట్టాయగూడెం, జనవరి 31: గిరిజన నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతి పంచాయతీలో డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటుచేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. లైబ్రరీల ఏర్పాటుతోపాటు ఉపాధి అవకాశాలను కల్పించడానికి కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షురాలు వంకా కాంచనమాల అధికారులను కోరారు. ఏజెన్సీలో గిరిజనుల ఆరోగ్య భద్రత కోసం ఆయుష్మాన్ భారత్ కార్డులను వెంటనే అందరికీ అందించాలని అవగాహన కల్పించాలన్నారు. ఏపీవో పీవీఎస్ నాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. మొడియం శ్రీనివాసరావు, బొల్లిన నిర్మల కిషోర్, ఏపీఆర్ చౌదరి, కొండేపాటి రామకృష్ణ, బొరగం వెంకటలక్ష్మి, కరిబండ నాగరాజు, చాట్రతి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో ప్రజలు సహకరించాలి : డీఎల్‌పీవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

లింగపాలెం, జనవరి 31: గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని డీఎల్‌పీవో సుందరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో బుధవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని దాదాపు 90 లక్షలకు పైగా పన్నులు వసూలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. పన్నులను త్వరగా చెల్లించేలా ప్రజలకు అవగాహన ఏర్పరచాలన్నారు. పంచాయతీ సిబ్బంది పన్నులను వసూలు చేయటంలో శ్రద్ధ చూపాలన్నారు. పన్ను చెల్లించే ప్రతిఒక్కరికి గ్రామంలోని అభివృద్ధిని తెలియపరచాలన్నారు. సమావేశంలో జేఎం రత్నకుమార్, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ

ఏలూరు టూటౌన్, జనవరి 31: విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు కుక్, కమాటీ మెరిట్‌లిస్టు విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో ఉంచినట్లు సహాయ సంచాలకులు టీఆర్.మణి తెలిపారు. ఐటీడీఏ ఏరియాలో ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న మెరిట్‌లిస్టును వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఫిబ్రవరి 7వ తేదీ 5గంటలలోపు తెలపాలన్నారు.

ధర్నా.. దీక్ష..

సమస్యలపై ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికుల పోరు



కలెక్టరేట్ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల రిలే దీక్ష



భూహక్కు చట్టంపై నిరసనగా రైతు, కార్మిక సంఘాల ధర్నా



కలెక్టరేట్ వద్ద నిరసన శిబిరంలో మెప్మా ఉద్యోగులు

యూటీఎఫ్ నాయకుల రిలే దీక్షలు

ఏలూరు కలెక్టరేట్, జనవరి 31: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు రెండో దశ పోరాటంలో భాగంగా ఫిబ్రవరి 3 వరకు నాలుగు రోజుల పాటు కలెక్టరేట్ వద్ద దీక్షలు కొనసాగిస్తారు. ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దీక్షలను రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు ముస్తప్ ఆలీ అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 వేల కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు. మొదటిదశ పోరాటంలో భాగంగా కలెక్టర్లకు వినతిపత్రం అందజేశామన్నారు. ఏపీజీఎల్ఐ రుణం, సరెండర్ లీవ్, డీఏ అరియర్స్, చెల్లించలేదని, వాటికోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు శ్యామ్‌బాబు, జి.వెంకటేశ్వరరావు, కనకదుర్గ, రంగమోహన్, టీవీ.సాగర్‌బాబు, వివిధ మండలాల నుంచి పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఓట్ ఫర్ ఓపీఎస్' దీక్ష పోస్టర్ల ఆవిష్కరణ

ఏలూరు ఎడ్యుకేషన్: 'ఓట్ ఫర్ ఓపీఎస్' నినాదంతో ఉద్యమం చేపట్టనున్నట్లు ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి రామారావు తెలిపారు. జడ్పీ కార్యాలయ ఆవరణలో జాతీయ నాయకుల విగ్రహాలవద్ద బుధవారం సాగర సంగ్రామ దీక్ష పోస్టర్లను ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులతో కలసి ఆవిష్కరించారు. పాత పెన్షన్ సాధనలో భాగంగా ప్రతీ సీపీఎస్ ఉద్యోగి ఉద్యమ కార్యాచరణకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. వారంలో పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో తప్పనిసరిగా గుణపాఠం చెప్పేందుకు ప్రతీఒక్కరూ కంకణబద్దులు కావాలన్నారు. పాత పెన్షన్‌కోసం చేపట్టిన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

దశలవారీ పోరాటంలో భాగంగా ఫిబ్రవరి 4న విశాఖలో దీక్ష, 11న విజయవాడలో ఐక్యత ఓటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నేతలకు వినతిపత్రాలు అందజేయడం, సోషల్ మీడియా ద్వారా వినతులు పంపడం, సెల్ఫీ వీడియోలతో సీపీఎస్ ఉద్యోగుల చేదు అనుభవాలను పోస్టింగ్ చేయడం చేపడుతున్నామన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యూటీఎఫ్, డీపీఆర్టీయూ, పీఆర్టీయూ, ఎస్టీయూ, ఏపీ సీపీఎస్ఈఏ, ఏపీటీఎఫ్-1938 సంఘాల జిల్లా నాయకులు రవికుమార్, ఆదినారాయణ, ఆంజనేయులు, పవన్‌కుమార్, ప్రసాద్, నాగదుర్గారావు, బెన్‌హర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టసవరణ తక్షణమే రద్దుచేయాలి

ఏలూరు కలెక్టరేట్: రైతులు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులు, అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే భూయాజమాన్య హక్కు చట్టం, అసైన్డ్ భూముల చట్టసవరణను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక ప్రజాసంఘాలు, న్యాయవాదుల సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు తదితరులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భూయాజమాన్య హక్కుల చట్టం ఇటీవల విడుదల చేసిన జీవోను 512 ద్వారా తీసుకువచ్చిన చట్టంలో రైతులకు, ప్రజలకు నష్టం కలిగించే నిబంధనలు ఉన్నాయని, ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం హక్కుల పై న్యాయపరమైన తీర్పుచెప్పే హక్కును రెవిన్యూ అధికారులకు అప్పచెప్పి న్యాయవ్యవస్థ పై రెవిన్యూ అధికారుల పెత్తనాన్ని ప్రోత్సహిస్తున్న భూయాజమాన్య హక్కుచట్టాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. డి.సోమయ్య కుప్పాల కన్నబాబు, కె.కన్నయ్య బి.ప్రభాకర్‌రావు, డీఎన్‌వీడీ.ప్రసాద్, రెడ్డి శ్రీనివాస డాంగే తదితరులు పాల్గొన్నారు.

8వ రోజుకు చేరిన సెర్ప్ ఉద్యోగుల ఆందోళన

ఏలూరు కలెక్టరేట్: సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె బుధవారం 8వ రోజుకు చేరింది. సెర్ప్ ఉద్యోగులు అందర్ని రెగ్యులర్ చేయాలని, అవసరమైన పోస్టుల మంజూరుకు జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, సీఐటీయూ నాయకులు బి.సోమయ్య తదితరులు మద్దతు తెలిపారు. అనిత, రజిని, ప్రభావతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అదనపు ఎస్పీగా జి.స్వరూపరాణి



ఏలూరు క్రైం, జనవరి 31 : జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) గా జి.స్వరూపరాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఏఎస్పీ (అడ్మిన్) ఎంజేవీ.భాస్కరరావును కాకినాడ జిల్లా ఏఎస్పీగా బదిలీ చేశారు. స్వరూపరాణి టీచర్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, ఎంపీడీవో ఉద్యోగాలు చేశారు. గ్రూప్ 1 రాసి 2012 డీఎస్పీగా పోలీస్ శాఖలో చేశారు. ఏ పోటీ పరీక్ష రాసినా మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సంపాదించారు. ఆమె కవి, రచయిత కూడా కావడంతో అనేక కేసుల్లో పోలీసులు కష్టపడి దర్యాప్తు చేసి అనేక సాక్ష్యాలు సేకరించి కోర్టు ముందు ఉంచగా సాక్ష్యులు లంచాలకు అమ్ముడుపోవడంతో పోలీస్ కష్టం అంతా వృదా అయిపోతుందని ఆవేదనతో 'ద్రోహులెవరు' రచనతో సంచలనం కల్గించారు. నెల రోజుల క్రితం తూర్పుగోదావరి జిల్లా ఏఎస్పీగా చేరిన ఆమె మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఏలూరు ఏఎస్పీగా బదిలీ అయ్యారు.

సమాచార శాఖ ఉద్యోగి మల్లీశ్వరికి సత్కారం



మల్లీశ్వరిని సత్కరిస్తున్న సిబ్బంది

ఏలూరు కలెక్టరేట్, జనవరి 31: జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ పొందిన మేడిది మల్లీశ్వరిని డీపీఆర్‌వో ఆర్‌వీఎస్ రామచంద్రరావు, సహచర ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. డీపీఆర్‌వో మాట్లాడుతూ 21 ఏళ్లు సమాచారశాఖలో అంకితభావంతో విధులు నిర్వహించి ఆదరాభిమానాలు పొందారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కె.ధనుంజయ్‌రాజు, సీహెచ్.రాంబాబు, కె.సూర్యనారాయణ, చౌరీప్రసాద్, టి.బాబురావు, టి.సాగర్, శారద, రత్నం తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ రామవరం సచివాలయంలో విచారణ

కామవరపుకోట, జనవరి 31: కేఎస్.రామవరం సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, ప్రజలకు అందుబాటులో ఉండడంలేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవోపీఆర్డీ జి.మరిడయ్య బుధవారం సచివాలయంలో సిబ్బందిని విచారించారు. రికార్డులను పరిశీలించి ఉద్యోగుల వాంగ్మూలం నమోదు చేశారు. నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని మరిడయ్య తెలిపారు.

పులి సంచారం పుకార్లతో భయం

కామవరపుకోట, జనవరి 31: జీలకర్రగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ సమీప పొలాలు, పామాయిల్ తోటల్లో బుధవారం పులి సంచరించిందంటూ పుకార్లు రావడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేశారు. పులి సంచరించిన జాడ లేదని, అదంతా అవాస్తవమంటూ అధికారులు కొట్టి పారేస్తున్నారు. పోలీసులు, అటవీశాఖ అధికారులు దీనిపై ధ్రువీకరించలేదు.

పూర్తి పారదర్శకతతో కులగణన : డీపీవో

పెదపాడు, జనవరి 31: కులగణన కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తున్నట్లు డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. వట్లూరులో జరుగుతున్న కుల గణన కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కులగణన నమోదుపై సిబ్బందికి సూచనలు చేశారు. మండలంలో 98 శాతం కులగణన సర్వే పూర్తయిందని, నమోదు కాబడిన కుటుంబసభ్యుల వివరాల ఖచ్చితత్వాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

ఏలూరు కల్చరల్, జనవరి 31: ఫైనార్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ఆర్ఆర్ పేట మార్కండేయ వేదపాఠశాలలో నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు బుధవారం ముగిశాయి. సంగీత విద్వాంసులు మల్లాది నారాయణశర్మ నేతృత్వంలో కళాకారులు త్యాగరాజస్వామి గానం నిర్వహించారు. పి.సావిత్రి, హేమసుందర్, ఏ.కృష్ణకుమార్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం : ఎలీజా



రోడ్డు ప్రారంభిస్తున్న విజయరాజు

చింతలపూడి, జనవరి 31 : వైఎస్ జగన్ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా మండిపడ్డారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తన నియోజకవర్గంలో కామవరపుకోట-బొర్రంపాలెం వయా కొండగూడెం ఏడు కిలోమీటర్ల రోడ్డుకు నిధులు మంజూరు చేయించి రోడ్డు పనులు పూర్తి చేయించానన్నారు. అధికారులు లేకుండా పార్టీలో కొందరితో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయరాజు ప్రారంభించారన్నారు. జంగారెడ్డిగూడెంలోని బుట్టాయిగూడెం సీసీ రోడ్డుకు కోటి 70 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ విధంగా ఎమ్మెల్యే ఉండగానే ఇలాంటి పనులు చేసి ప్రజాస్వామ్యంలో పాలనను అపహాస్యం చేస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

3న సీఎం సభకు ఏర్పాట్లు

దెందులూరు, జనవరి 1: దెందులూరు నియోజకవర్గంలో ఆశ్రం ఆస్పత్రి సమీపంలో ఫిబ్రవరి 3న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'సిద్ధం' సభకు ఆపార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్, ఎస్పీ, జేసీ, ట్రైనీ కలెక్టర్, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఉమ్మడి గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో 300 మంది సీఎం సభకు ఏర్పాట్లను శరవేగంతో చేస్తున్నారు. బుధవారం సభాస్థలి వద్ద తలశిల రఘురాం, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, నాయకులు సిద్ధం వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. కాగా సభా ఏర్పాట్లను ఎస్పీ తదితర అధికారులు పర్యవేక్షించారు.

స్కౌట్ విద్యార్థులతో పాఠశాల అధ్యాపకుల భేటి



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

కామవరపుకోట, జనవరి 31: రావికంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఇటీవల ఏలూరు జిల్లాలో జరిగిన రిపబ్లిక్ పరేడ్‌లో మార్చ్ చేసి జిల్లా కలెక్టర్, డీఈవో నుంచి ప్రశంసా పత్రాలు పొందారు. వారికి బుధవారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం బొడ్డు రాములు, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చలి మంచులో సైతం నాగేశ్వరరావు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొనడానికి పాటుపడ్డారని ప్రశంసించారు. స్కౌట్స్‌లో చేరిన విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, సేవా భావం, దేశభక్తి అలవడుతుందన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు

పెదపాడు, జనవరి 31: పునుకొల్లు గ్రామ పరిధిలోని మినుము, మొక్కజొన్న పంటలపై కత్తెర పురుగు ఆశించిందని, నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని ఏవో ప్రదీప్‌కుమార్ సూచించారు. ఏవో ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ కత్తెర పురుగు నివారణకు హిమమెక్టిన్ బెంజోయేట్ 5 శాతం పిచికారీ చేసుకోవాలని, కొత్తగా మొక్కజొన్న వేసుకునే రైతులు నీటి పరీక్ష చేసుకున్న తర్వాత మొక్కజొన్న పంటను వేసుకోవాలన్నారు.

అపరిచితుల వస్తువులను తాకవద్దు

ఏలూరు క్రైం, జనవరి 31 : రైలు ప్రయాణంలో అపరిచితుల వస్తువులను తాకరాదని, వారితో సంభాషణ వద్దని ఏలూరు రైల్వే ఏఎస్ఐ పి.సైమన్ అన్నారు. రైల్వే భద్రత, ప్రయాణికుల రక్షణ అంశాలపై పవర్‌పేట స్కూల్ విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు వెంటనే పోలీసులకు తెలిజేయాలని సూచించారు. రైళ్లలో ప్రయాణించేటప్పుడు అనుమానాస్పద వ్యక్తులతో మాట్లాడకూడదని హెచ్చరించారు.

పోలవరంలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణం



వీరేశ్వరస్వామి కల్యాణంలో భక్తులు

పోలవరం, జనవరి 31: పోలవరం పెద రామాలయంలో పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణం బుధవారం నిర్వహించారు. ఆలయ ఈవో ఎస్ఎస్ సంగమేశ్వర శర్మ ప్రత్యేక వాహనంలో ఉత్సవ విగ్రహాలను పోలవరం ఏటిగట్టు వద్దకు తీసుకువచ్చారు అక్కడి నుంచి ఊరేగింపుగా పెద రామాలయానికి తీసుకువెళ్లి శాంతి కల్యాణం నిర్వహించారు. ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణం నిర్వహించినట్లు ఈవో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు తెలిపారు. పోలవరం మండవల్లి బాబ్జి, చోడిశెట్టి రాంబాబు, మద్దు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 31 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్లూమ్, వీవింగ్) లోయర్, హయ్యర్‌గ్రేడ్ పరీక్షలను ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.శ్యాంసుందర్ బుధవారం తెలిపారు. ఏడో తరగతి ఉత్తీర్ణులు ఈ పరీక్షలకు అర్హులని వివరించారు. అభ్యర్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో పరీక్షఫీజు చెల్లించి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఫీజు ఫిబ్రవరి 20లోగా చెల్లించవచ్చని, దరఖాస్తును మార్చి 8లోగా డీఈవో కార్యాలయంలో అందజేయాలని ఆయన వివరించారు.

ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

బుట్టాయగూడెం, జనవరి 31: ప్రభుత్వం వెంటనే ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీని ప్రకటించాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన కమిటీ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో ఏటా జనవరిలో మెగా డీఎస్సీ ప్రకటిస్తామని వాగ్దానం చేసి ఐదేళ్లు గడుస్తున్నా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మంత్రివర్గం 6100 టీచర్ పోస్టులు ప్రకటించిందని రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఐదేళ్లలో స్పెషల్ డీఎస్సీ అతిగతీ లేకుండా చేసి ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం చేసిందన్నారు. స్పెషల్ డీఎస్సీని ప్రకటించి ఏజెన్సీలో అన్ని టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

జీలుగుమిల్లి తహసీల్దార్, ఎంపీడీవో బదిలీ

జీలుగుమిల్లి, జనవరి 31: ఎన్నికల నేపథ్యంలో మండల అధికారుల బదిలీల్లో భాగంగా తహసీల్దారు జి.సుందర్‌సింగ్ కృష్ణాజిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో కేఆర్ఎస్.కృష్ణప్రసాద్ తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం, జనవరి 31: అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కేవీ.రమణ డిమాండ్ చేశారు. దర్మన్న స్మారక భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న అంగన్వాడీ యూనియన్లతో జరిగిన చర్చలలో అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో ఎస్టీ, ఎస్సీ, ఓబీసీ తదితరులకు చేయూత పథకాన్ని విడుదల చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి వర్కర్లు, మినీ వర్కర్లు, ఆయాలకు ఈ పథకాలు వర్తించేవిధంగా జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు జూన్‌లో పెంచుతామన్న ప్రభుత్వం ఈ పథకాలైన వెంటనే అమలు చేయాలని, చేయూత, విద్యా దీవెన తదితర పథకాలన్నీ వెంటనే అమలయ్యేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రమణ డిమాండ్ చేశారు.



కె.కోట మండలం జయహో బీసీ సదస్సులో శ్యాంచంద్రశేషు



టీడీపీ మినీ మేనిఫెస్టో వివరిస్తున్న చింతమనేని ప్రభాకర్



పెదవేగి మండలంలో నాయీబ్రాహ్మణ సాధికారత సమావేశం



ఏలూరులో నాయీబ్రాహ్మణ బీసీ భరోసా కేలెండర్ ఆవిష్కరణ

బీసీలను జగన్

మోసగించారు

జయహో బీసీ సదస్సులో దాసరి శేషు ధ్వజం

కామవరపుకోట, జనవరి 31: జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చాక అమలు చేసిన విధానాలకు పొంతన లేదని, బీసీలను మోసగించారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాంచంద్రశేషు అన్నారు. పాతూరులో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జిజ్జూరి బాబ్జీ అధ్యక్షతన బుధవారం జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. ఐక్యంగా ఉన్న బీసీలను కార్పొరేషన్స్ అంటూ విడగొట్టారన్నారు. ఎన్నికల్లో 129 కార్పొరేషన్లను పెడతా ఒక్కో కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయిస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా కేటాయించాలేదన్నారు. 75 వేల కోట్ల రూపాయలు బీసీల నిధులు దారి మళ్లించిన బీసీ ద్రోహి జగన్ అని విమర్శించారు. జుజ్జూరి బాబ్జీ మాట్లాడుతూ ఈబీసీలకు ఒక్క రూపాయి కూడా రాయితీ రుణాలు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, కొండపల్లి రవి, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, దొడ్డాకుల గంగాధరరావు, వజీర్‌ఖాన్, వేములు నాగేశ్వరరావు, నూతి లక్ష్మీనారాయణ, మరీదు వెంకట్రావు, రెబ్బా పరాత్పరరావు, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, కొప్పర్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. బీసీ నాయకులంతా ర్యాలీగా సభా స్థలానికి చేరుకున్నారు.

టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు

దెందులూరు: వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీ కార్యకర్తల జోలికొస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయాని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావు అన్నారు. సోమవరప్పాడులో మాగంటి సురేంద్రనాథ్ చౌదరి, నాయకులతో కలసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. లండన్ బాబు అక్రమ మైనింగ్ చేయిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై దాడులు చేయిస్తూ తిరిగి లండన్ టికెట్ బుక్ చేసుకున్నారన్నారు. యిప్పిలి వెంకటేశ్వరరావు, పెనుబోయిన మహేష్‌యాదవ్ మాట్లాడుతూ చింతమనేనిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. బోడేటి మోహన్‌బాబు, ఏనుగు రామకృష్ణ, నున్న లక్ష్మణ్ బాబు, గారపాటి కొండయ్యచౌదరి, కసూకుర్తి రామకృష్ణ, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు,

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పెదవేగి: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షుడు విశ్వం శాంతారామ్ పిలుపునిచ్చారు. విజయరాయిలో టీడీపీ నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘం నాయకులు ప్రతి గ్రామంలో కులవృత్తులు చేసుకునే దుకాణాలకు వెళ్లి, రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసేలా చైతన్య పర్చాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే నాయీబ్రాహ్మణుల సంక్షేమం సాధ్యపడుతుందని ఆయన తెలిపారు. ఈడ్పుగంటి సుందరయ్య, కొప్పెర్ల నాగరాజు, కొప్పాక వీర వెంకట సత్యనారాయణ, దావీదు, కొప్పెర్ల దుర్గారావు, నరం సత్యనారాయణ, అన్నవరపు రామకృష్ణ, ప్రసాద్, రాజశేఖర్, అంకమ్మ, శోభనాచలం, బాలసింధు, వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణం పాల్గొన్నారు.

వీఏ.పురంలో టీడీపీలో చేరికలు

ఉంగుటూరు: ప్రజలు తెలుగుదేశం పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. వెంకట అప్పారావుపురం అగ్రహారంలో పలువురు గన్ని సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగులూరి ధర్మారావు, గోకా సాయి, సింగులూరి విశ్వనాథం, కడియాల రవిశంకర్, పాతూరి విజయకుమార్, నల్లా ఆనంద్, ఇమ్మణ్ణి గంగాధరరావు, మారిశెట్టి ప్రసాద్, కరణం పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సానుకూల ఓట్లనే తొలగిస్తున్నారు

ద్వారకాతిరుమల: వైసీపీ సానుకూల ఓట్లను ఉంచి టీడీపీ సానుకూల ఓట్లను తొలగిస్తున్నారని నేతలు ఆరోపిస్తున్నారు. ద్వారకాతిరుమలలోని ఓ హోటల్‌లో బుధవారం టీడీపీ నేతలు మాట్లాడుతూ, వైసీపీ నేతల ప్రమేయంతోనే ఓటర్ల తుది జాబితా తప్పుల తడకలుగా ఉందని విమర్శించారు. ఎప్పుడో మృతి చెందిన వారి పేర్లు ఇంకా ఓటర్ల జాబితాలో కొనసాగుతూనే ఉన్నాయన్నారు. జాబితాలో లోపాలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళతామన్నారు. నేతలు రేపూరి వెంకటేశ్వరరావు, కొరపాటి వెంకన్న గువ్వల చంద్రం, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: నాయీబ్రాహ్మణ బీసీ భరోసా క్యాలెండర్‌ను బడేటి క్యాంపు కార్యాలయంలో బడేటి చంటి ఆవిష్కరించారు. నాయీ బ్రాహ్మణులకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు శాంతారామ్, కన్వీనర్ నాగరాజు, ఉపాధ్యక్షుడు సీహెచ్.నందీశ్వరరావు, పి.మురళి, రంబా శ్రీనివాసరావు, జయబాబు, కేవీ సత్యనారాయణ, కె.దావీదు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు ఎడ్యుకేషన్ :** నరసింహారావుపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. డాక్టర్ ప్రగతి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు రోగులకు రక్తపరీక్షలు, ఈసీజీ, కంటిపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.
- **ఏలూరు క్రైం :** ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు చట్టం రద్దు చేయాలంటూ న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు షేక్ మస్తాన్ బాషా, నారాయణరావు, దాశరధి, ఆంజనేయరాజు, సత్యనారాయణ నిరాహార దీక్షలో కూర్చున్నారు.
- తలసీమియా బాధితుల రక్తమార్పిడి సమయంలో ఉపయోగించే ల్యూకోసైట్ ఫిల్టర్ సెట్లను ఏలూరు కెమిస్ట్ అండ్ డ్రగిస్టు అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డికి అందజేశారు. రూ. లక్ష విలువైన సెట్లను రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డికి అందజేశారు
- నెహ్రూ కాలనీ రైల్వే బ్రిడ్జి క్రింద మద్యం విక్రయిస్తున్న ఒక మహిళను ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మద్యం విక్రయిస్తుందనే సమాచారం అందుకుని త్రీ టౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఆమె నుంచి నాలుగు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేశారు.
- **చింతలపూడి :** ఆలపాటి నాగేశ్వరరావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పరామర్శించారు టీడీపీ నాయకుడు బొమ్మాజీ అనిల్ కూడా ఆ కుటుంబాన్ని పరామర్శించారు.
- **పెదపాడు :** సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో డిజైన్ థింకింగ్ అంశంపై రెండు రోజుల వర్క్‌షాపును నిర్వహించారు. కేఎల్ యూనివర్శిటీ సీఐఐఈ డైరెక్టర్ డాక్టరు కె.నరసింహారాజు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.
- **పెదవేగి :** ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.272లు అందేలా అనువైన రీతిలో పని చేయించాలని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి ఆయన పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఏపీవో హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** రావులపర్రులో పేకాట స్థావరంపై చేబ్రోలు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.1,750 స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఐక్యత చాటుతున్న మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, కామినేని శ్రీనివాస్, మాగంటి బాబు తదితరులు

బీసీలమని అణగదొక్కినా..

ప్రజల వెంటే ఉంటాం

- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర
- అటపాకలో జయహో బీసీ
- బీసీలంతా వైసీపీని సాగనంపాలని నాయకుల పిలుపు

కైకలూరు, జనవరి 31: వైసీపీ ప్రభుత్వం బీసీలను అణగదొక్కి, అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసినా జైలు నుంచి తిరిగివచ్చి తాము ప్రజల్లోకే వెళతామని మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం ఆటపాకలో జయహో బీసీ సభను జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. వందలాది బైకులతో కొల్లు రవీంద్రను ర్యాలీగా సభా ప్రాంగణానికి పూలవర్షం కురిపిస్తూ తీసుకువచ్చారు. సభలో కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఎన్టీఆర్ బీసీలకు పెద్దపీట వేశారని, వైసీపీ ప్రభుత్వం బీసీలకు 57 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంటూ నాలుగున్నరేళ్లుగా అణగదొక్కిందని, దీనిని బీసీలంతా గుర్తించాలన్నారు. తెలుగుదేశం పార్టీకి అండగా బీసీలుంటున్నారని కక్షగట్టి పార్టీలో ప్రధాన నాయకులుగా ఉన్న అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడుతో పాటు తనను కూడా అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపిన విషయాన్ని గుర్తుచేశారు. తాము జైలుకు పోయినా మరలా ప్రజల్లోనే ఉంటామని ముఖ్యమంత్రికి పదవి పోతే పూర్తిగా జైలు జీవితమే మిగులుతుందన్నారు. అనేక కుట్రలు, కుతంత్రాలతో మరలా అధికారంలోకి రావాలని జగన్ ప్రయత్నిస్తున్నారని బీసీలు అప్రమత్తతో ఉండి అధికారపార్టీ ఎత్తుగడలను ప్రతి ఒక్కరికి తెలియజేసి ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. ఇటీవల ఓ మత్స్యకారుడ్ని తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉంటున్నాడని అక్రమ కేసు పెట్టి అతడే ఆత్మహత్య చేసుకునేలా వేధింపులకు గురిచేశారన్నారు. రానున్న రోజుల్లో కొల్లేరు సమస్యను పరిష్కారానికై చిత్తశుద్ధితో పనిచేసి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాజీమంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రౌడీలను ప్రోత్సహించి బీసీ నాయకులపై దాడులు చేయించారన్నారు. ఇలాంటి నాయకులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. మాజీ ఎంపీ మాగంటి బాబు మాట్లాడుతూ బీసీలంతా ఐక్యంగా ఉండి టీడీపీ-జనసేన ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాలన్నారు. ఈ నెల 5న చింతలపూడిలో 'రా కదలిరా' కార్యక్రమాన్ని పార్లమెంటు స్థాయిలో నిర్వహిస్తున్నామని కైకలూరు నియోజక వర్గం నుంచి ప్రజలు పెద్దఎత్తున సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వీరంకి గురుమూర్తి, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల రావు, బీసీ నాయకులు టీకేఎం నాని, బలే ఏసురాజు, పూల రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, అంగ్రాజు శ్రీనివాసరావు, వీరమల్లు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నాయకులు తేరా రమేష్, టీడీపీ నాయకులు కొత్త నాగేంద్రబాబు, కొడాలి వినోద్, పెన్మెత్స వెంకటేశ్వరరాజు, నాలుగు మండల పార్టీల అధ్యక్షులు, బీసీ నాయకులు పరసా విశ్వేశ్వరరావు, బీసీ మహిళా నాయకురాలు గంగుల శ్రీదేవి, గంగుల వెంకట నరసమ్మ, తెంటు వెంకటరమణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



జయహో బీసీ సభకు హాజరైన ప్రజలు

జనరల్ ఫండ్ ఎగవేత

- ఆర్థిక సంఘం నిధులూ కాజేశారు..
- గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేదెలా?
- సర్పంచ్‌ల ఆగ్రహం



జనార్దనవరం పంచాయతీ

ప్రభుత్వం పంచాయతీలకు రెండేళ్లుగా కనీసం జనరల్ ఫండ్ కూడా ఇవ్వకుండా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జనరల్ ఫండ్ ఏడాదికి పెద్ద పంచాయతీలకు రూ. 4 లక్షల నుంచి 5 లక్షలు, చిన్న పంచాయతీలకు 2 లక్షల నుంచి 3 లక్షలు వచ్చేవని వాటితో సిబ్బంది జీతాలు, తాగునీటి పథకాలు, వీధిలైట్లకు వినియోగించేవారమని, ఇప్పుడు సర్కార్ పుణ్యమా అని తాగునీటి పథకాలు, వీధిలైట్లు నిర్వహణకు సొమ్ములేక అప్పులు పుట్టక తాము పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం అని సర్పంచ్‌లు వాపోతున్నారు.

చాట్రాయి, జనవరి 31: సకాలంలో పనులు చెయ్యకపోవటంతో ప్రజల్లో తేలికయ్యామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయాంలో గ్రామాల్లో భూముల క్రయవిక్రయాలు ద్వారా వచ్చే ఆదాయంలో 12 శాతం జనరల్ ఫండ్ పేరుతో పంచాయతీ ఖాతాలకు జమచేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దాన్ని 6 శాతాలనికి తగ్గించి అది కూడా ఇవ్వకుండా రెండేళ్లుగా మొండి చెయ్యి చూపటంతో సర్పంచ్‌ల పరిస్థితి దయనీయంగా మారింది. చాట్రాయి మండలంలో 18 గ్రామ పంచాయతీల నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు పలు దఫాలుగా కరెంట్ బిల్లుల పేరుతో ప్రభుత్వం తమకు చెప్పకుండా రూ. 3 కోట్ల వరకు లాగేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వవలసిన గ్రాంట్లు ఇవ్వకుండా కేంద్రం ఇచ్చిన నిధులు కూడా ఇవ్వకపోవడం అన్యాయమని సర్పంచ్‌లు అంటున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ నిధుల కేటాయింపులో కూడా వివక్ష చూపుతున్నారని నార్ధనవరం సర్పంచ్ పామర్తి ఝాన్సీ రాణి ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే తమ స్థాయిని మించి 10 రెట్లు అప్పులు చేశామని కొత్త అప్పులు ఇచ్చే నాథుడు కన్పించటం లేదని, పనులు చెయ్యలేకపోవటంతో ప్రజల ఆగ్రహానికి గురవుతున్నామని సర్పంచ్‌లు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కనీసం జనరల్ ఫండ్ బకాయిలైనా విడుదల చేసి ఆదుకోవాలని సర్పంచ్‌లు వేడుకొంటున్నారు.

వైద్యం వికటించి బాలుడి మృతి

ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన



నూజివీడు టౌన్, జనవరి 31: వైద్యం వికటించి ఓ చిన్నారి మృతి చెందడంతో నూజివీడు పట్టణంలో ఉద్రిక్తత ఏర్పడింది. వివరాలిలా ఉన్నాయి. నూజివీడు పట్టణం ఆర్‌ఆర్ పేటకు చెందిన వేముల రంగబాబు కుమారుడు యశ్వంత్ శ్రీరామ్ (11) మూడురోజుల క్రితం కాలికి గాయమవడంతో నూజివీడు తుమ్మలవారివీధిలో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు మందులు ఇచ్చి పంపారు. అయితే బుధవారం ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో శ్రీరామ్‌ను బుధవారం ఉదయం ఆసుపత్రికి తీసుకురాగా పరీక్షలు చేసిన వైద్యులు ఇన్‌ఫెక్షన్ ఉందని చిన్నారికి ఇంజక్షన్ ఇచ్చారు. ఇంటికి తీసుకువెళ్ళేసరికి బాలుడి శరీరం మొత్తం నీలం రంగులోకి మారింది. దీంతో తిరిగి బాలుడిని వైద్యం చేసిన ప్రైవేట్ ఆసుపత్రికి తల్లిదండ్రులు తీసుకువచ్చారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో తక్షణం విజయవాడకు తీసుకువెళ్ళాలని ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు పేర్కొంటూ మరో రెండు ఇంజక్షన్‌లు ఇచ్చి పంపారని, ఆసుపత్రి నుంచి బయటకు వచ్చి కొద్ది దూరం వెళ్లేసరికే బాలుడి పరిస్థితి మరింత దిగ జారడంతో స్థానికంగా ఉన్న అమెరికన్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ పూర్తిస్థాయి వైద్యసేవలు అందించేలోపే శ్రీరామ్ మృతి చెందాడని, ప్రైవేట్ ఆసుపత్రి వైద్యం వికటించడం వల్లే మృతిచెందాడంటూ బాలుడి బంధువులు, ఆర్‌ఆర్‌పేట వాసులు ఆసుపత్రి వద్ద బాలుడి మృతదేహంతో ఆందోళనకు దిగారు. దీంతో నూజివీడు పట్టణ సీఐ మూర్తి సంఘటనా స్థలికి చేరుకుని దోషులపై చర్యలు తీసుకుంటామంటూ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సుప్రీం తీర్పు జగన్‌కు చెంపపెట్టు: ముద్దరబోయిన



నూజివీడు, జనవరి 31: చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని చూస్తున్న జగన్‌కు సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన అన్నారు. నూజివీడు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో జగన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. చంద్రబాబు సభలకు హాజరైన ప్రజలను చూస్తే టీడీపీకి ప్రజల మద్దతు ఎలా పెరుగుతుందో అర్థం అవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం, భూ పట్టాదారు చట్టం రద్దు, అన్యాక్రాంతమైన భూములను యజమానులకు అప్పగించేందుకు సిట్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ ఇబ్రహీం, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఏడుకొండలు, నూజివీడు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, జీవీ రామారావు, ఏలూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ సుబానీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో రాజకీయాలు వద్దు : కామినేని



మండవల్లి, జనవరి 31: గ్రామ అభివృద్ధిలో రాజకీయాలకు తావు లేకుండా అందరూ కలసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండవల్లి మండలం పులపర్రులో ఏబీసీ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు కామినేని చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కామినేని మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి అడ్రస్ లేదని, ప్రజా సంక్షేమ పథకాలను పూర్తిగా విస్మరించారని దుర్మార్గపు పాలన సాగుతుందని కామినేని విమర్శలు చేశారు. గ్రామ అభివృద్ధికి పంచాయతీలకు నేరుగా చేరవలసిన నిధులు కూడా ప్రభుత్వం దారి మళ్లింపు వల్ల గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. గ్రామంలో ప్రజలు సమష్టిగా నడుం బిగించి అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. గ్రామ ప్రముఖుడు శంకర రావు, టీడీపీ నాయకుడు ముళ్లపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా నియమించిన సిబ్బందితో డైరెక్టర్ చంద్రశేఖర్

ట్రిపుల్ ఐటీ ముఖ్య విధుల్లో నూతన సిబ్బంది

నూజివీడు టౌన్, జనవరి 31: ఆర్జీయూకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్ విధులను బలోపేతం చేసే లక్ష్యంతో డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ సంస్థలోని కీలక స్థానాలకు సిబ్బందిని బుధవారం ప్రకటించారు. సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న టి.చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.శ్రీనాథ్‌ను ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా నియమించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రత్నాకర్‌ను ఇన్‌చార్జ్ డీన్ అకడమిక్స్ ఆఫీసర్‌గా నియమించారు. వీరు తమకు కేటాయించిన పదవుల్లో ఫిబ్రవరి 1 నుంచి ఏడాది పాటు కొనసాగనున్నారు.

విపక్ష వార్డుల్లో అన్యాయం

- నిధుల వినియోగంపై టీడీపీ కౌన్సిలర్ల ధ్వజం
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

నూజివీడు, జనవరి 31: నూజివీడు మున్సిపాల్టీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు సీఎం వైఎస్ జగన్ మంజూరు చేసిన నిధుల వినియోగంలో ప్రతిపక్ష వార్డులకు అన్యాయం చేస్తున్నారంటూ టీడీపీ కౌన్సిలర్లు నిరసన తెలిపారు. బుధవారం నూజివీడు మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల నూజివీడు సభకు వచ్చిన సీఎం మున్సిపల్ అభివృద్ధికి, సచివాలయానికి కోటి రూపాయలు మంజూరు చేయగా, ఆ నిధుల ఖర్చు విషయమై నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ అధికారులను ప్రశ్నించారు. తాము గుర్తించిన సమస్యల పరిష్కారానికి అధికారులకు తెలియచేశామని వాటి పరిష్కారం ఎప్పుడు అవుతుంది అంటూ ప్రశ్నించడంతో సచివాలయాలకు మంజూరైన అభివృద్ధి నిధుల విషయంలో స్థానిక ఎమ్మెల్యే సూచించిన వాటికి ప్రతిపాదనలు పంపామని, ఆమోదం లభించగానే టెండర్లు పిలిచి అభివృద్ధి పనులు చేపడతామంటూ నూజివీడు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. దీంతో అభివృద్ధి నిధులు ఖర్చు విషయంలో మున్సిపల్ కౌన్సిల్‌కు సంబంధం లేదా అంటూ టీడీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నూజివీడు పట్టణంలో ప్రజల రక్షణ మున్సిపల్ అధికారులకు పట్టడం లేదని కోతులు, కుక్కల బెడదతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా వాటి నియంత్రణపై చర్యలు తీసుకోమని క్రితం సారి జరిగిన రెండు సమావేశాల్లోనూ తెలిపినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహ రిస్తున్నారంటూ మున్సిపల్ కౌన్సిలర్లు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెండు, మూడు రోజుల్లో కోతులు, కుక్కల బెడద నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని మున్సిపల్ డీఈ లక్ష్మీనారాయణ తెలిపారు. సమావేశంలో నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ప్రశ్నిస్తున్న ఫ్లోర్‌లీడర్ దుర్గాప్రసాద్ (ఇన్‌సెట్) చైర్‌పర్సన్ త్రివేణిదుర్గ

సాగునీటి విడుదలకు చర్యలు

కలిదిండి, జనవరి 31 : ఎండుతున్న మినుము పంటకు సాగునీరు విడుదల చేయటానికి చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ ఏఈఈ బి.సిద్ధార్థ తెలిపారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో సాగునీరివ్వరూ... శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద సీబీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేశారన్నారు. కోరుకొల్లు లాకుల వద్దకు మూడు రోజుల్లో చేరుకుంటుందని, సాగునీరిచ్చి మినుము పంట కాపాడటానికి కృషి చేస్తున్నామన్నారు. నీటి లభ్యత తక్కువ ఉందని రైతులు యుద్ధప్రాతిపదికన ఆయిలింజన్లతో నీరు తోడుకుని మినుము పంటకు తడి పెట్టుకోవాలన్నారు.

ఎమ్మార్ అప్పారావుకు ఘననివాళి



నూజివీడు టౌన్, జనవరి 31: విద్యాదాత, మాజీ మంత్రి డాక్టర్ ఎంఆర్ అప్పారావు 21వ వర్ధంతి సందర్భంగా నూజివీడు పట్టణంలో డీఏఆర్ కళాశాలలో గల ఆయన విగ్రహానికి జనసేన నాయకుడు ముత్యాల కామేష్ ఘన నివాళి అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రి వ్యవస్థాపకులు, నూజివీడు ప్రాంతంలో అనేక ఆలయాలు, చర్చిలు, మసీదుల నిర్మాణాలు చేపట్టిన అజాత శత్రువు ఎంఆర్ అప్పారావు అని ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయా లన్నారు. ఆయనకు పద్మశ్రీ ఇవ్వాలని అందుకు రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాపునాడు అధ్యక్షుడు కొండూరు రంగారావు, 6వ వార్డు నూజివీడు మండల జనసేన ఉపాధ్యక్షుడు యింటూరి చంటి, జనసేన నాయకులు మమ్ములనేని సునీల్‌కుమార్, నాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న న్యాయాధికారిణి లక్ష్మి

అనాథ పిల్లలతో అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు

కైకలూరు, జనవరి 31: అనాథ పిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తప్ప వని కైకలూరు సీనియర్ న్యాయ అధికారిణి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. బుధవారం స్ట్రీట్ చిల్డ్రన్స్ డే సందర్భంగా కైకలూ రులోని ఎయిమ్ ఫర్ సేవ సంస్థలోని పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా సేవాసమితి పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడెం సత్యనారాయణ, న్యాయవాదులు ఎంఎస్ఎస్ రాజు, పి. పవన్‌కాంత్, పి. ప్రసన్నకుమార్, డి. శివప్రసాద్, కె. రమాదేవి, ఎ. దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయం పరిశీలించిన ఫ్రాన్స్ దేశస్తుడు

ఆగిరిపల్లి, జనవరి 31: గుజరాత్, మహారాష్ట్రలోని తమ జ్యూస్ కంపెనీలకు ఏపీలో ప్రకృతి వ్యవసాయ పంటలు ఎంతవరకు పనికి వస్తాయనే విషయం తెలుసుకోవడానికి ఫ్రాన్స్ దేశపు బాయిరోస్ కంపెనీకి చెందిన పెర్రెపోస్టేడ్ వచ్చారు. పురుగు మందులు వాడకుండా సేద్యం చేస్తున్న మామిడి, క్యారెట్, క్యాబేజీ, ముల్లంగి తదితర పంటలను ఆయన పరిశీలించి విత్తనం విత్తేటప్పుడు, ఎదుగుదలకు పురుగు సోకకుండా ఎటువంటి కషాయాలు వాడుతారో తెలుసుకుని వారి జ్యూస్ కంపెనీకి రిప్రజెంట్ చేశారు. ఈ పంటలు తమ జ్యూస్ కంపెనీలకు తద్వారా మానవాళి ఆరోగ్యానికి ఏ విధంగా మేలు చేస్తాయనే విషయంపై ఆగిరిపల్లి, వడ్లమాను, ఈదర వద్ద గల ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పరిశోధన చేశారు. ఈయనతో పాటు హైదరాబాద్ ఎన్ఆర్వో సిబ్బంది, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్లు మహబూబ్ వలీ, తాతారావు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా హేమమాలిని



నూజివీడు టౌన్, జనవరి 31: నూజివీడు మున్సిపల్ నూతన కమిషనర్‌గా హేమమాలిని బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన హేమమాలినిని ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా నూజివీడు కమిషనర్‌గా బదిలీ చేయగా ఇప్పటివరకు నూజివీడు కమిషనర్‌గా పనిచేసిన సయ్యద్ రషీద్ అద్దంకి కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

ఆగిరిపల్లి నుంచి పలువురు అధికారుల బదిలీ

ఆగిరిపల్లి, జనవరి 31: ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆగిరిపల్లిలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఆగిరిపల్లి ఎస్సై చంటిబాబును విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు, టినరసాపురం ఎస్సైగా పనిచేసిన సురేంద్రబాబును ఆగిరిపల్లి స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే ఆగిరిపల్లి తహసీల్దార్‌గా సేవలు అందించిన ఎం.ఉదయ్‌భాస్కర్‌ను కాకినాడకు బదిలీ చేశారు. ఆగిరిపల్లి తహసీల్దార్‌గా ఎవరు బాధ్యతలు స్వీకరించేదీ వివరాలు అందలేదు. ఆగిరిపల్లి ఎంపీడీవో టి.శంకర్‌రావును గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు.

ముదినేపల్లి తహసీల్దార్ బదిలీ

ముదినేపల్లి, జనవరి 31 : ముదినేపల్లి తహసీల్దార్ కె.శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఆయన్ని పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జరిగిన బదిలీల్లో భాగంగా ఈ బదిలీ జరిగింది. ఇదిలా ఉండగా ముదినేపల్లి ఎంపీడీవో పి.మల్లీశ్వరిని గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలానికి బదిలీ చేశారు.



అమరులైన వైద్యులకు నివాళి

నూజివీడు టౌన్, జనవరి 31: కొవిడ్ వైద్యసేవలో అమరులైన వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బందికి నూజివీడు ఐఎంఏ వైద్యులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక అమ్మవారితోటలో సత్యనారాయణ నేత్రాలయం వద్ద నూజివీడు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవికిరణ్, కార్యదర్శి డాక్టర్ శిరీష, పూర్వ అధ్యక్షులు డాక్టర్ బొబ్బిలి ఝాన్సీరాణి, సీనియర్ వైద్యులు డాక్టర్ తాతయ్య బాబు, డాక్టర్ హనుమంతరావు చౌదరి, డాక్టర్ రాఘవరావు తదితరులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. వైద్యులు విజయ్, డాక్టర్ వెంకటరెడ్డి శ్రీనివాస్, రామకృష్ణ, శైలజ, నాయుడు, భరత్, అన్నపూర్ణ, శైలజారాణి, శ్రీకాంత్, దంతేష్, అనఘ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



యోగా గురువు సాంబశివరావును సత్కరిస్తున్న నాగరాణి

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

ముదినేపల్లి, జనవరి 31 : విద్యార్థులు పరీక్షల పేరుతో మానసిక ఒత్తిడికి గురి కావద్దని ఏలూరు జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి ఆర్.వి.నాగమణి అన్నారు. బుధవారం ముదినేపల్లిలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో కొల్లేటికోట, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి, కైకలూరు బీసీ బాలుర, బాలికల వసతి గృహాల్లోని టెన్త్ విద్యార్థులకు "ప్రగతికి ప్రేరణ" కార్యక్రమం కింద ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునే పరిస్థితులను వసతి గృహ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు ఉండ్రమట్ల సాంబశివరావు విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించేందుకు పలు సూచనలు చేశారు. బీసీ సంక్షేమాధికారిణి నాగరాణి యోగా గురువు సాంబశివరావును సన్మానించారు. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రావి రవి ప్రసాద్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు బి.సురేష్‌బాబు, నిర్మల, పలువురు ఉపాధ్యాయులు సత్యనారాయణ రాజు, రాంబాబు, గొట్టిపాటి రమేష్, నాగరాజు పాల్గొని ఆయా సబ్జెక్టులపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

మంచినీటి ఎద్దడి లేకుండా చూడండి



మండవల్లి, జనవరి 31: గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గప్రసాద్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు మంచినీటి సమస్య లేవనెత్తారు. దీనిపై స్పందించిన ఎంపీపీ పెద్దిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులు ఆదేశించారు. వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. కైకలూరు ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో పి. వెంకటరమణ, వివిధ శాఖ అధికారులు, ఎంపీటీసీలు, గ్రామసర్పంచ్‌లు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులందజేసిన దృశ్యం

కుటుంబ స్థితిగతులు మార్చే వజ్రాయుధం విద్య

ముసునూరు, జనవరి 31: కుటుంబ స్థితిగతులను మార్చగల వజ్రాయుధం విద్యేనని, చదువు చదివించు అనే నినాదంతో నిరంతరం గ్రామీణ విద్యను ప్రోత్సహిస్తున్న ఆముదాల తిరుపతయ్య, మేరీ రత్నావళి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశయం గొప్పదని ఎంపీపీ కొండా దుర్గాభవానీ వెంకట్రావు కొనియాడారు. రమణక్కపేట జడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం రామకృష్ణ అధ్యక్షతన విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదు బహుమతులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా 3వ తరగతి నుంచి 10వ తరగతిలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని రామారావు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ విద్యార్థులకు అందజేశారు. అలాగే వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన 8 మంది విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను కొత్తపల్లి మాజీ సర్పంచ్ బొకినాల కాంతకుమారి, వెంకటరత్నం అందజేశారు. పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ట్రస్ట్ చైర్మన్ ఆముదాల కాంతారావుకు పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. పలు పార్టీల నాయకులు బత్తుల వెంకటేశ్వరరావు, పాశం నాగబాబు, వేముల బక్కయ్య, మల్లాది చంటి, శ్యాము తదితరులు పాల్గొన్నారు.

మినుము పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కలిదిండి, జనవరి 31 : మినుములో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ తెలిపారు. ప్రస్తుతం మినుము పైరుకు తెల్లదోమ, తామరపురుగు ఆశించటంతో పైరు రంగు మారి పూత రాలిపోతుందన్నారు. వీటి నివారణకు ఎసిసమప్రైడ్‌ను తగు మోతాదులో పిచికారీ చేయాలన్నారు. పైరుకు సకాలంలో సాగునీరివ్వాలన్నారు.

రేపు ఫిష్ ఆంధ్రా ఆక్వా హబ్ ప్రారంభం

కలిదిండి, జనవరి 31 : కలిదిండిలో నిర్మించిన ఫిష్ ఆంధ్రా ఆక్వా హబ్‌ను ఫిబ్రవరి 2వ తేదీన ప్రారంభిస్తున్నామని మత్స్యశాఖ ఏడీ చాన్ బాషా తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్నారని, ఆక్వా రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

ముదినేపల్లి రూరల్, జనవరి 31: మండలంలోని వైవాకలో రూ. 37.5 లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవనానికి బుధవారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు భూమి పూజ చేశారు. రైతులకు సంఘాల ద్వారా సులభతరమైన రుణాలు అందిస్తున్నామని, రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘాల బలోపేతానికి సంఘ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ సత్యనారాయణ, చేబోయిన వీర్రాజు, గ్రామస్థాయి నాయకులు హాజరయ్యారు.

అపరాల పంటలో తెగుళ్లపై అవగాహన ఉండాలి

ముదినేపల్లి రూరల్, జనవరి 31: అపరాల సాగులో పైరుకు వచ్చే తెగుళ్ళపై పూర్తి అవగాహన ఉండాలని మండవల్లి ఏడీఏ వెంకటమణి సూచించారు. బుధవారం అపరాల సాగు పై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వాతావరణానికి అనుకూలంగా తట్టుకునే రకాలను ఎంపిక చేసుకుని సాగు చేస్తే ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించవచ్చని సూచించారు. పైరులో నిత్యం ఆకులను పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



చాట్రాయి, జనవరి 31: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం భారీ ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అన్నారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్ ఆవరణలో బుధవారం జరిగిన సభలో మండలంలోని 1119 స్వయం సహాయక సంఘాలలోని 11,883 మంది మహిళలకు ఆసరా 4వ విడత నిధులు రూ. 9.89 కోట్లు చెక్కును అందజేశారు. రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంకా నిర్మల, నాయకులు బాబ్జీ, సుబ్బారెడ్డి, జగన్మోహనరావు, కారంగుల వాసు, చెన్నారావు, ప్రసాద్ బాబు, అప్పిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో ఆరోగ్యకర సమాజం

నూజివీడు టౌన్, జనవరి 31: రసాయన ఎరువులు వాడవద్దని, సేంద్రియ సాగుతో భూసారాన్ని పెంచడంతో పాటు ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటు చేయవచ్చని నూజివీడు ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి అన్నారు. మిట్టగూడెంలోని హరిత వర్మి కంపోస్ట్ యూనిట్‌లో వానపాముల ఎరువు తయారీ, భూసారం పెంపు అనే అంశం పై ఉద్యాన పాలిటెక్నిక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

డస్ట్ బిన్‌ల పంపిణీ

ముదినేపల్లి, జనవరి 31 : గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు పంచాయతీ పాలక వర్గాలు, అధికారులు సమష్టి కృషి చేయాలని ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కింద పంచాయతీలకు డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి పంపిణీ చేస్తున్న ఈ డస్ట్ బిన్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మల్లీశ్వరి కోరారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గ్రోత్ ప్రమోటర్‌పై అవగాహన

ముదినేపల్లి, జనవరి 31 : వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు, సిబ్బంది గ్రోత్ ప్రమోటర్ తయారీ కార్యక్రమాన్ని బుధవారం బొమ్మినంపాడులో నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో కోడిగుడ్లు, నిమ్మరం కలిపి ద్రావణాన్ని తయారు చేసి స్థానికులకు చూపించారు. గౌతమ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మినుము పైరుపై ఈ ద్రావణాన్ని పిచికారీ చేస్తే మొక్కల ఎదుగుదల, పూత దశకు బలం చేకూరుతుందని తెలిపారు. ద్రావణం తయారీ విధానం కూడా చూపించారు. సీఆర్పీలు అనూష, సుధాకర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఆరు జట్లు

ముసునూరు, జనవరి 31: నూజివీడు నియోజకవర్గ స్థాయిలో డీఆర్ కాలేజీలో జరిగిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో వివిధ విభాగాల్లో ముసునూరు మండలం నుంచి ఆరు జట్లు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. క్రికెట్‌లో చెక్కపల్లి, బ్యాడ్మింటన్‌లో చెక్కపల్లి, షటిల్ బ్యాడ్మింటన్ (మహిళా విభాగం)లో చింతలవల్లి జట్టు, వాలీబాల్ (మహిళా విభాగం)లో ముసునూరు-2 జట్టు, కబడ్డీలో అక్కిరెడ్డిగూడెం జట్టు, ఖోఖోలో ముసునూరు-1 జట్టు నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవగా వారికి ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, ఎంపీడీవో జి.రాణి, పీడీ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.